
PDF Compressor Free Version


Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 02.08.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 09 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## తెలుగుజాతి...
# గుండె పగిలింది



## కసాయి కాంగ్రెస్ నిలువునా నరికింది

- తెలుగుగుండె తల్లడిల్లింది
- సీమాంధ్ర నిలువెల్లా మండింది
- రాజకీయ స్వార్థం రాజ్యమేలింది
- తెలుగు నేల రెండుగా చీలింది

తెలుగుజాతి రెండుగా చీలింది. తెలుగుతల్లి గుండె రెండుగా బద్దలయ్యింది. తెలుగుభాష, తెలుగు సంస్కృతి, తెలుగు నేల నెర్రెలిచ్చింది. ఒకరి రాజకీయ మనుగడ కోసం, మరొకరి రాజకీయ ప్రయోజనాల కోసం తెలుగుతల్లిని అడ్డంగా నరికారు. దేశంలోనే తొలి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణ పేరుతో రెండు ముక్కలు చేసి, పెద్దదిగా వున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రెండు చిన్న రాష్ట్రాలుగా విభజించారు.


రాష్ట్ర విభజనకు అంకురార్పణ జరిగింది. తెలంగాణ ఏర్పాటుకు కేంద్రంలో అధికారాన్ని అనుభవిస్తున్న కాంగ్రెస్‌పార్టీ పచ్చజెండా వూపింది. జూలై 30వ తేదీన ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ సమావేశంలో రాష్ట్ర విభజనపై తీర్మానం జరిగింది. పదిజిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు కాంగ్రెస్ అధిష్టానం ఆమోదముద్ర వేసింది. సిడబ్ల్యుసికి ముందు యూపిఏ భాగస్వామ్యపక్షాలతో నిర్వహించిన సమావేశంలోనూ శరద్‌పవార్, అజిత్‌సింగ్ లాంటివారు తెలంగాణ ఏర్పాటుకే ఓటేసారు. ప్రత్యేక వాదాన్ని వ్యతిరేకించే తృణమూల్‌కాంగ్రెస్, ఆర్జేడీ, డిఎంకె వంటి పార్టీలు కూటమిలో లేకపోవడం తెలంగాణకు కలిసొచ్చింది. యూపిఏలో కొనసాగుతున్న మిత్రపక్షాలలో నేషనల్ కాన్ఫరెన్స్ ఒక్కటే తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించింది. అయినా కాంగ్రెస్ అధిష్టానం దానిని పరిగణన లోకి తీసుకోలేదు. సమస్యను ఇక ఎక్కువకాలం నాన్చడం ఇష్టంలేని కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్రాన్ని రెండుముక్కలు చేయడానికే సిద్ధపడింది. సిడబ్ల్యుసి సమావేశం అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకులు దిగ్విజయ్‌సింగ్ విభజన ప్రకటన చేసారు. రాయలతెలంగాణ వూహాగానాలకు తెరదించుతూ పదిజిల్లాలతో కూడిన తెలంగాణను ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు పదేళ్లపాటు హైదరాబాదే ఉమ్మడి రాజధానిగా వుంటుందని, ఈలోపు ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటవుతుందని సెలవిచ్చారు. (మిగతా 10వ పేజీలో)

## అధిష్టానంపై...
# సీమాంధ్ర సీరియస్
### రాజీనామాల బాటలో మంత్రులు, ఎమ్మెల్యేలు

సీమాంధ్ర భగ్గుమంటోంది. సమైక్య నినాదం మార్మోగు తుంది. కాంగ్రెస్‌పార్టీ తమను మోసం చేసిందనే ఆవేశం తెలుగుప్రజలలో కట్టలు తెంచుకుంటోంది. ప్రజల ఆవేశం సునామీని తలపిస్తుంది. తెలంగాణ ప్రకటనకు ముందే వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్ర విభజనకు నిరసనగా రాజీనామాలు చేసారు. చంద్రబాబు ఒత్తిడితో తెలుగుదేశం ఎమ్మెల్యేలు ఏమీ చేయలేని స్థితిలో వున్నారు.


సీమాంధ్ర ప్రజల ముందు తమ పార్టీ అధిష్టానం తమను దోషులుగా నిలిపిందనే ఆవేదనలో సీమాంధ్ర కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలున్నారు. సీమాంధ్రలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ఇక ప్రజల ముందుకు పోలేని వాతావరణం. ఈ దశలో పార్టీ కంటే ప్రజలవైపు (మిగతా 10వ పేజీలో)

# కొత్త రాజధాని ఎక్కడ?




ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పుడు కొత్త రాజధాని కావాలి. ఇన్నాళ్లు ఉమ్మడిగా అభివృద్ధి చేసుకున్న హైదరాబాద్‌ను తెలంగాణవాళ్లు లాక్కుపోయారు. కాబట్టి ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని కావాలి. అదెక్కడా అన్నదే ప్రశ్నగా మారనుంది.

కోస్తాలో 9జిల్లాలు, రాయలసీమలో 4జిల్లాలు వున్నాయి. ఎవరికి వాళ్లు తమ ప్రాంతంలోనే కొత్త రాజధాని ఏర్పడాలని కోరుతున్నారు. రాయలసీమ నాలుగు జిల్లాలవాళ్లు కర్నూలు లేదా తిరుపతిలను రాజధానులుగా (మిగతా 5వ పేజీలో)




## తండ్రిని దాటిన
# తనయ

- 3వేల కిలోమీటర్ల పాదయాత్రతో షర్మిల సంచలనం

ఇది అపూర్వ ఘట్టం... అరుదైన సంచలనం... అద్భుత ఆవిష్కరణ. పులి కడుపున పులే పుడుతుందనడానికి సజీవసాక్ష్యం.

ఒకటి కాదు వంద కాదు వెయ్యి కాదు... మూడువేల కిలో మీటర్లు. విమానంలో కాదు రైల్లో కాదు, కార్లో కాదు... కాళ్లతో నడిచి. మాట తప్పని, మడమతిప్పని యెదుగూరి సందింటి రాజశేఖరరెడ్డి బిడ్డగా షర్మిల తన తండ్రిలోని పట్టుదలకు ప్రతీకగా నిలిచింది. పౌరుషానికి ఆయన నిలువెత్తు ప్రతిరూపంగా మన ముందు సాక్షాత్కరించింది. (మిగతా 10వ పేజీలో)

PDF Compressor Free Version





# అడకత్తెరలో... పోకచెక్కల్లా తెలుగుతమ్ముళ్లు

సమైక్యాంధ్ర విషయంలో చంద్రబాబు రెండుకళ్ల సిద్ధాంతం ఆ పార్టీ నాయకులకు కళ్లు తిరిగేలా చేస్తుంది. తెలంగాణకు అనుకూలంగా ఆయన తీర్మానం చేసివున్నందువల్ల సమైక్యాంధ్ర విషయంలో ఆ పార్టీ నాయకులు ఏం మాట్లాడలేక, ఏం మాట్లాడాలో తెలియక ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు.

కేంద్రం రాష్ట్ర విభజన ప్రకటన చేసిన నేపథ్యంలో సీమాంధ్రప్రాంతం నుండి కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వేగంగా స్పందించారు. వైకాపా ఎమ్మెల్యేలు రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా రాజీనామాలు చేసేసారు. కాంగ్రెస్ నుండి సీమాంధ్ర మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా రాజీనామాలు పడేయడానికి సిద్ధంగా వున్నారు. కాని తెలుగుదేశం ప్రజాప్రతినిధుల్లోనే చలనం కొరవడింది. 2009 డిసెంబర్ 9న కేంద్రం తెలంగాణను ప్రకటించినప్పుడు ఈ జిల్లాలో వున్న 4మంది తెలుగుదేశం ఎమ్మెల్యేలు వెంటనే స్పందించారు. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా రాజీనామాలు చేసారు. కాని కాలక్రమంలో చంద్రబాబు స్వరం మారిపోయింది. తెలంగాణకు ఆయన అనుకూలమన్నాడు. రాష్ట్ర విభజనపై ఆయన ఏమీ మాట్లాడడం లేదు. సీమాంధ్రలో కూడా తన పార్టీ వారినెవరినీ మాట్లాడనీయడం లేదు. గతంలో మన జిల్లా నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా గట్టిగా మాట్లాడేవాడు. చంద్రబాబు ఆయన నోటికి తాళంవేశాడు. ఇప్పుడు సోమిరెడ్డి కూడా రాయలతెలంగాణకు మాత్రమే వ్యతిరేకంగా మాట్లాడాడు గాని తెలంగాణకు కాదు. జిల్లాలో ఆ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలున్నా విభజన విషయమై ఎవరూ నోరు విప్పి మాట్లాడలేక చంద్రబాబును మనసులోనే తిట్టుకుంటున్నారు.

# మహిళామార్గాణుల కోసం వేట



స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు 50శాతం రిజర్వేషన్‌లను అమలులోకి తేవడంతో రాజకీయపార్టీలకు అభ్యర్థులవేట పెద్ద సమస్యగా వుంది. ముఖ్యంగా మహిళలకు రిజర్వేషన్‌లు పెరగడంతో రాజకీయాలలో వుంటున్న చాలామంది పురుషులను నిరుద్యోగులుగా మారుస్తుంది.

గ్రామపంచాయితీ ఎన్నికలు ముగిసాయి. ఇక మున్సిపల్ ఎన్నికలున్నాయి. జిల్లాలో నెల్లూరు కార్పొరేషన్‌తోపాటు కావలి, ఆత్మకూరు, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాల్సివుంది. కార్పొరేషన్‌లో, మున్సిపాల్టీలలో ఏ కేటగిరికి ఎన్ని డివిజన్‌లు, ఎన్ని వార్డులు అనే రిజర్వేషన్‌లు ఖరారయ్యాయి. అయితే ప్రతి కేటగిరిలోనూ సగం డివిజన్‌లు, వార్డులు మహిళలకుంటాయి. కాబట్టి ఈసారి పెద్దసంఖ్యలో మహిళలు నగరపాలకసంస్థ, మున్సిపల్ ఎన్నికలలో కనిపించబోతున్నారు.

ఇంతకాలం పురుషులు ప్రత్యక్ష రాజకీయాలలో ఎక్కువగా కనిపిస్తుండేవాళ్లు కాబట్టి ఆయా రాజకీయపార్టీలకు అభ్యర్థుల ఎంపిక సులభంగానే వుండేది. ప్రత్యక్ష రాజకీయాలలో వుండే మహిళలు చాలా తక్కువ. అలా వున్నవారిని పోటీకి పెట్టినా గెలుస్తారనే నమ్మకం లేదు. సంబంధిత ప్రాంతాలలో మంచిపేరు, అందరితో సత్సంబంధాలు వున్న మహిళలను వెదికి పోటీకి నిలబెట్టాలి. నెల్లూరు నగరపాలకసంస్థలో 54డివిజన్‌లున్నాయి. వీటిలో 27డివిజన్‌లకు మహిళా అభ్యర్థులను నిలబెట్టాలి. గతంలో మాజీకార్పొరేటర్లుగా వున్న మహిళలలో కొంతమంది మళ్లీ బరిలోకి దిగే అవకాశాలున్నాయి. సగం డివిజన్‌లు మహిళలకే రిజర్వ్ అయినందువల్ల కొత్త మహిళా అభ్యర్థులను వెదికేపనిలో ప్రధాన రాజకీయపార్టీలు నిమగ్నమై వున్నాయి. ఈ విషయంలో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి చాలా ముందుచూపుతో వ్యవహరిస్తూ ఎక్కడికక్కడ మహిళా అభ్యర్థులను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది.

# దీనిని ప్రజాస్వామ్యమంటారా?



తూ... తూ... వీటిని ఎన్నికలంటారా? ఇది ప్రజాస్వామ్యమంటారా? ప్రజాస్వామ్య వ్యవస్థ ఇంత ఘందాలంగా వుంటుందా? అసలు ఇలాంటి ఎన్నికలను జరపాల్సిన అవసరం వుందా? ఈ విధంగా ఎన్నికలు జరిపిన దానివల్ల ఏం లాభం? ఎవరికి లాభం? అసలు ఈ ఎన్నికలు ఎవరిని ఉద్ధరించడానికి పెడుతున్నట్లు?

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటును వజ్రాయుధమంటారు. నిజమే, అవినీతిని తెగనరకడానికి, నిర్లక్ష్యాన్ని నిలువునా వధించడానికి వాడితే అది వజ్రాయుధమే! కాని అందుకు దానిని వాడడం లేదు. ఎలక్షన్ మార్కెట్‌లో ఆ వజ్రాయుధాన్ని అమ్మకానికి పెడుతున్నారు. ఇంతకీ దాని విలువ ఎంతో తెలుసా? 500 రూపాయల నోటు... ఒక క్వార్టర్ మద్యం సీసా!

మనం ఇంకా నూరుశాతం అక్షరాస్యతను సాధించలేదు. నూరుశాతం అభివృద్ధిని సాధించలేదు. నూరుశాతం పోలియోరహిత సమాజాన్ని నిర్మించలేదు. నూరుశాతం నేరరహిత దేశాన్ని ఏర్పాటు చేయలేదు. కాని నూటికి నూరుశాతం ఓట్లకు డబ్బులిచ్చి కొనుగోలుచేసే విధంగా ముందుకు పోతున్నాం. ఇప్పటివరకైతే ఓట్లకు డబ్బులిచ్చే పర్సంటేజీలో కొంత తేడా వుండొచ్చేమోగాని... అతి త్వరలో మాత్రం ఆ విషయంలో మాత్రం మనం నూరుశాతానికి చేరుకుంటామనిపిస్తుంది.

ప్రస్తుతం పంచాయితీ ఎన్నికలు జరిగిన తీరుచూస్తే ప్రజాస్వామ్యవాదులెవరైనా సిగ్గుతో తలదించుకోక తప్పదు. ఓటుకు డబ్బులిచ్చి కొనే నీచ, నికృష్టమైన పని ఈ ఎన్నికలలో నిర్విఘ్నంగా జరిగిపోయింది. మంచివ్యక్తిని మీ ప్రతినిధిగా ఎన్నుకోండని రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పచ్చనోట్లకు, మద్యంబాటిళ్లకు యథేచ్ఛగా అమ్ముకున్నారు. మేజర్ పంచాయితీలలో ఒక్కో అభ్యర్థికి కోటిరూపాయలు, చిన్న పంచాయితీలలో ఒక్కో అభ్యర్థికి పాతిక నుండి 50లక్షల వరకు ఖర్చయ్యిందంటే... ఓట్లను ఏ స్థాయిలో అమ్ముకుంటున్నారో అర్థమవుతుంది. ఈ తొక్కలో ఎలక్షన్‌లు పెట్టడానికి నెల, రెండునెలల పాటు అధికారయంత్రాంగమంతా తమ పనులు మానుకుని కుస్తీపట్టాలి. పాపం పోలీసులకైతే పెద్దశ్రమ. తిండితిప్పలు కూడా (మిగతా 10వ పేజీలో)

- విభజనతో భగ్గుమన్న నెల్లూరు
- వెల్లువెత్తిన ఆందోళనలు
- రోడ్డెక్కిన సమైక్యవాదులు
- మూతపడ్డ విద్యాసంస్థలు, కార్యాలయాలు

# మండుతున్న గుండెలు

మంగళవారం సాయంత్రం రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దిగ్విజయ్‌సింగ్ రాష్ట్ర విభజన ప్రకటన చదువుతూ టీవీలలో కనిపించారు. ఆయన ఢిల్లీలో విభజన గురించి మాట్లాడాడు కాబట్టి సరిపోయిందిగాని, ఎదురుగా మాట్లాడి వుంటేనా, ఆ టీవీలు చూస్తున్న సమైక్యవాదులకు వచ్చిన కోపానికి చేతికి ఏది దొరికితే అది తీసుకొని కొట్టుండేవాళ్లు. దిగ్విజయ్‌సింగ్ తెలంగాణ ఏర్పాటును ప్రారంభిస్తున్నామని చెప్పిన వెంటనే సమైక్యవాదులు ఆగ్రహంతో వూగిపోయారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో రోడ్లమీదకు చేరి ఆందోళనలకు దిగారు. రాష్ట్ర విభజనకు నిరసనగా విద్యార్థి జేఏసీ 48గంటల బంద్‌కు పిలుపునివ్వడంతో బుధ, గురువారాలలో జిల్లా అంతటా జనజీవనం స్థంభించిపోయింది. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కూడా మూతపడ్డాయి. ప్రజాప్రతినిధులెవరూ అందుబాటులో లేకపోయినా విద్యార్థులే బంద్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్సులు అరకొర తిరిగాయి.

నెల్లూరుతో పాటు కావలి, గూడూరు, ఆత్మకూరు, నాయుడుపేట డివిజన్‌లలో సమైక్యాంధ్ర బంద్‌ను విజయవంతంగా నిర్వహించారు.







## జిల్లాలో మొలకెత్తుతున్న ఆశలు

# రియల్'బూమ్' అందుకునేనా?

రాష్ట్ర విభజనపై విద్యార్థి సంఘాలు ఉద్యమిస్తున్నా, రాజకీయ నాయకులు విమర్శలతో విరుచుకుపడుతున్నా రియల్టర్లలో మాత్రం కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలో నిర్జీవంగా వున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారం మళ్లీ వూపందుకుంటుందనే ఆశలతో వున్నారు.

తెలంగాణ విడిపోవడాన్ని జిల్లాలో కొంతమంది వ్యతిరేకిస్తున్నారు. ఇంకొంతమంది స్వాగతిస్తున్నారు. వీరికి ఎవరి కారణాలు వారికున్నాయి. ఇప్పుడు హైదరాబాద్ తెలంగాణ రాజధాని అవుతుంది. సీమాంధ్ర కొత్త రాజధాని ఏర్పాటు చేసుకోవాలి. కొత్త రాజధాని అన్నాక ప్రతిదీ కొత్తగా ఏర్పాటు చేసుకోవాలి. కొత్త రాజధానిని కోస్తాంధ్రలోనే ఏర్పాటుచేసే అవకాశాలున్నాయి. ఒంగోలు నుండి ఏలూరుల మధ్యనే రాజధాని ఏర్పాటుకు ఎక్కువ అవకాశాలున్నాయి. రాజధానిని ఎక్కడ ఏర్పాటు చేసినా నెల్లూరుజిల్లాలో మాత్రం రియల్‌బూమ్ ఖాయమని చాలామంది భావిస్తున్నారు. ఇప్పటివరకు హైదరాబాద్‌లో ఎక్కువగా పెట్టుబడులు పెడుతూ వచ్చింది నెల్లూరువాళ్లే! ఇక నుండి వాళ్లు హైదరాబాద్‌పై పెద్దగా దృష్టి పెట్టకపోవచ్చు. సొంత జిల్లాలో పెట్టుబడులు పెట్టడానికి మొగ్గుచూపవచ్చు. ఇక పారిశ్రామికంగా కూడా నెల్లూరుజిల్లా కీలకంగా మారబోతుంది. పరిశ్రమల ఏర్పాటుకు, వాణిజ్య సంబంధాల అభివృద్ధికి జిల్లాలో వున్న రెండు పోర్టులు ప్రధాన వేదిక కానున్నాయి. కృష్ణపట్నం పోర్టు ద్వారా ఇప్పటికే ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నాయి. ఇక్కడ 42బెర్తులు పూర్తయితే ఆసియా ఖండంలోనే అతిపెద్ద పోర్టులలో ఇదొకటి అవుతుంది. ఇక కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో తలపెట్టిన అతిపెద్ద ఓడరేవు కూడా జిల్లాలోని దుగరాజపట్నం వద్ద మంజూరు కావడం తెలిసిందే! ఒకే జిల్లా పరిధిలో రెండు పెద్దపోర్టులు రావడం చాలా అరుదు. ఆంధ్రప్రదేశ్ వాణిజ్య కార్యకలాపాలన్నింటికి భవిష్యత్‌లో నెల్లూరే వేదిక కానుంది.

కొత్త రాజధాని ఎక్కడ ఏర్పడినా నెల్లూరుజిల్లా ప్రాధాన్యత ప్రత్యేకంగా వుంటుంది. రియల్‌ఎస్టేట్ పెట్టుబడిదారులు ఎక్కువగా నెల్లూరువైపే వచ్చే అవకాశాలున్నాయి. తెలంగాణ ప్రకటనతో జిల్లాలోని రియల్టర్‌లు ఈ రూపంలోనైనా తమ కష్టాలు తీరుతాయేమోనని ఎదురుచూస్తున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పల్లెపోరు





నెల్లూరు జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మూడు దఫాలుగా జరిగిన ఎన్నికల్లో పోటీ నువ్వా నేనా అన్నట్లుగా సాగింది. మూడవ విడత పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌పార్టీ స్వల్ప మెజార్టీ సాధించింది.

తొలి, మలి దశల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ మూడోదశలో వెనుకపడింది. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశంపార్టీ కావలి, నెల్లూరు డివిజన్లకంటే గూడూరు డివిజన్‌లో పుంజుకుంది. చెదురుముదురు సంఘటనలు మినహా జిల్లా పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు విడతల్లో కలిపి కాంగ్రెస్‌కు 113, 55, 88స్థానాలు, టీడీపీకి 95, 33, 87స్థానాలు, వైసీపీ 101, 90, 82 స్థానాలు లభించాయి. అత్యధికంగా వైకాపా 273స్థానాలు దక్కించుకోగా, అధికార కాంగ్రెస్ 256, ప్రధానప్రతిపక్షమైన టీడీపి 215 స్థానాలతో మూడో స్థానానికి పరిమితమైంది. వైసిపి కావలి, నెల్లూరు డివిజన్‌లో ఆధిక్యాన్ని కొనసాగించినప్పటికి మూడో దశలో వెనుకపడింది.

## ప్రత్యేక హంగులతో కొత్త కలెక్టరేట్ రూపకల్పన

నెల్లూరుజిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రత్యేక హంగులతో గ్రీన్‌బిల్డింగ్ తరహాలో కొత్తగా నిర్మించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ సూచించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం వివిధశాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని దర్గామిట్ట టిబి ఆసుపత్రి వద్ద 12.50ఎకరాల స్థలంలో నిర్మించే కొత్త కలెక్టరేట్ కార్యాలయం భవనంలో దాదాపు 60శాఖలు వస్తాయన్నారు. వీటిని గ్రీన్‌బిల్డింగ్ రూపంలో నిర్మించాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలని అందుకుగాను తయారుచేసిన డిజైన్ వివరించాలని రోడ్డు భవనాలశాఖ అధికారులకు సూచించారు. దీంతో రోడ్డు భవనాలశాఖ అధికారులు మాట్లాడుతూ గ్రీన్ బిల్డింగ్ నిర్మాణం వల్ల విద్యుత్ అంతరాయం కలిగినప్పుడు వెంటనే వెలుతురు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. గతంలో కొత్త భవనానికి 35కోట్లు విడుదలైనాయని, అయితే గ్రీన్‌బిల్డింగ్ తరహా నిర్మాణానికి సుమారు 95కోట్లు అయ్యే అవకాశం ఉందని వివరించారు. వీటికి సంబంధించి ప్రైవేటు సంస్థలచే డిజైన్ కూడా తయారుచేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.లక్ష్మీకాంతం డిఆర్వో రామిరెడ్డి రోడ్డు భవనాలశాఖ ఇఇ నాగమల్లు, ఏఓ మధుసూదన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓగా పెంచలరెడ్డి



నెల్లూరుజిల్లా పరిషత్ ఇన్‌చార్జి సీఈఓగా అదనపు జాయింట్ కలెక్టర్ చల్లా పెంచలరెడ్డిని నియమిస్తూ కలెక్టర్ శ్రీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. జడ్పీ సిఇఓ వీర భద్రయ్య ఉద్యోగ విరమణ చేసారు. రెగ్యులర్ సీఈఓను ప్రభుత్వం నియమించేందుకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా ఉండడంతో పెంచలరెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించారు. పెంచలరెడ్డి ప్రస్తుతం కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా, ఇన్‌చార్జి డిపీఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## 4న బెగోరె అవార్డుసభ





ఈ నెల 4వ తేదీ ఆదివారం ఉదయం 10గంటలకు నెల్లూరు టౌన్‌హాల్‌లో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు ప్రదానోత్సవ సభ జరుగుతుంది.

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటీ నిర్వహించే ఈ సభలో రామోన్‌మెగసెసే అవార్డు గ్రహీత పద్మశ్రీ శాంత సిన్హా డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డునందుకుంటారు. మాజీ శాసనసభ స్పీకర్ అగరాల ఈశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సభలో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీశాసనసభ్యురాలు శ్రీమతి మాగుంట పార్వతమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్ రెడ్డిలు విశిష్ట అతిథులుగా పాల్గొంటారు. ఈ సభలో అగరాల ఈశ్వరరెడ్డి రచించిన 'నోస్టాల్‌జియా' బయోగ్రఫీ ఆఫ్ డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి పుస్తకావిష్కరణ జరుగుతుంది.

ఈ సందర్భంగా బెజవాడ గోపాలరెడ్డి కుమార్తె శ్రీమతి దేగా అనూరాధ ప్రగతి ఛారిటీస్‌కు 75వేల రూపాయలను శ్రీమతి శాంత సిన్హా చేతులమీదుగా అందజేయనున్నారు.

## కళాంజలి స్వరఝరి



అప్పుడప్పుడు నెల్లూరు నగరంలో వీనులవిందైన పాటల కార్యక్రమాలను నిర్వహిస్తూ అలసిన మనసులను ఉత్సాహపరిచే కళాంజలి అనంత్ ఈ నెల 3వ తేదీ కూడా నెల్లూరు టౌన్‌హాల్‌లో ఓ మంచి కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాడుతాతీయగా-2013 చిన్నారులు పరమేశ్వరరావు, శ్రీలలిత, షణ్ముఖప్రియ, సుదీప్, సాహితి, దివ్యతేజలచే "కళాంజలి స్వరఝరి" కార్యక్రమాన్ని ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్నారు. 3వ తేదీ సాయంత్రం 6గంటల నుండి టౌన్‌హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుంది.

# facebookలో ఈ వారం


ట్విట్టర్, ఆర్కుట్, ఫేస్‌బుక్ ఇలాంటి వందలాది సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ల ద్వారా కోట్లాది మంది ప్రజలు సమాజంలో జరుగుతున్న ఎన్నో సంఘటనలను ఒకరితో ఒకరు పంచుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఫేస్‌బుక్ బాగా ప్రాచుర్యంలోకి వచ్చి భావప్రకటన చేసుకోవడానికి అంతర్జాతీయంగా ఒక పెద్ద వేదికయ్యింది. ఆ ఫేస్‌బుక్ ద్వారా అనేక మంది అనేక విషయాల్లో అందించిన అభిప్రాయాలలో కొన్నింటిని ఎంపిక చేసి యధాతథంగా ఈ వారం నుండి వారం వారం మా "లాయర్" పాఠకులకు అందిస్తున్నాము ఆదరించండి, ఆనందించండి.

## రాష్ట్రానికి రంపపుకోత




ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణను హైదరాబాద్‌తో సహ వేరుచేసిన సందర్భంగా రాష్ట్రాన్ని సోనియా రంపపుకోతకు గురిచేసి తెలంగాణ జంతువులకు బలిచ్చినట్లుగా నెల్లూరు వై.యస్.ఆర్.సి.పి అభిమానులు ఈ చిత్రాన్ని ఫేస్ బుక్‌లో పెట్టారు.

## లగడపాటి సన్యాసం




తెలంగాణ ఇస్తే రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని లగడపాటి రాజగోపాల్ చెప్పిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ వెంకట కిషోర్ ఈ వ్యంగ్య చిత్రాన్ని ఫేస్‌బుక్‌లో వుంచాడు.

## "బండ" మనసు




తెలంగాణ వాళ్ళు కాలుతో తన్ని ఆంధ్ర వాళ్ళని తరిమేస్తున్నట్లుగా వున్న ఈ చిత్రాన్ని హైదరాబాద్ మాజీ మేయర్ బండకార్తీకరెడ్డి షేర్‌చేశారు. గౌరవప్రదమైన పదవిని వెలగబెట్టిన కార్తీకరెడ్డి ఇలాంటి పనులు చేస్తుండంటే తెలంగాణ నేతల బుద్ధి ఎలాంటిదో వేరే చెప్పనవసరంలేదు.

## "చంద్ర కిరణ్"



చంద్రబాబు కిరణ్‌ల పోలికలతో ఒక చిత్రాన్ని రూపొందించి "సైకిల్"తో "చేయి" కలిపిన నేతల తీరును చెప్పకనే చెప్పిన ఎ.పి.పాలిటిక్స్ ప్రవీణ్.

## After 2014 Election



## "2014 తరువాత సోనియా"

ఉద్యమకారుల్ని ఏరివేస్తూ పోలీసులతో అరెస్టు చేయిస్తున్న సోనియాను అదే పోలీసులు 2014లో ఏరిపారేస్తారని సూచిస్తూ గిరిబాబు ఫేస్‌బుక్‌లో పెట్టారు.





## "ఇటలీని పోలిన ఆంధ్రా"

ఆంధ్రప్రదేశ్‌ను రెండుగా విడగొట్టి ఆంధ్రా పాలిత ప్రాంతాన్ని ఇటలీకి దగ్గరగా వున్నట్లుగా చూపిస్తూ సోనియమ్మ నిర్వాకాన్ని నిరసిస్తూ వైభవ్ శ్రీనివాస్ ఫేస్‌బుక్‌లో వుంచిన చిత్రం.

PDF Compressor Free Version






## సిమెంట్‌రోడ్లతో అవస్థలు

నెల్లూరును సిమెంట్‌రోడ్లు వేసి చెడగొడుతున్నారు. కాంట్రాక్టర్లను బతికించడానికి తప్పితే ప్రజలకు సిమెంట్‌రోడ్లు అవసరం లేదు. మెయిన్‌రోడ్లలో తారురోడ్లే అందంగా వుంటాయి. తక్కువ సమయంలో తారురోడ్లు వేయొచ్చు కాబట్టి ట్రాఫిక్ ఇబ్బందులు కూడా వుండవు.

ఎస్.వి.రామ్, నెల్లూరు.

## కేంద్రంలో దృతరాష్ట్రపాలన

కేంద్రంలో గుడ్డి దర్బార్ నడుస్తుంది. పరిస్థితులను అంచనా వేయకుండానే రాష్ట్రాన్ని చీల్చింది. సీమాంధ్ర వారికి అన్యాయం చేసింది. హైదరాబాద్‌ను అందరూ కలసి అభివృద్ధి చేస్తే, తెలంగాణ ఒక్క దానికే ఎలా ఇస్తారు? ఇటలీలో పుట్టిన సోనియాకు ఈ ప్రాంతాల సంస్కృతి, సెంటిమెంట్లు తెలియవు. కాబట్టే ప్రజల మనోభావాలతో చెలగాట మాడుతుంది. విభజన తర్వాత తెలంగాణలో ఆంధ్రులను ఉండనిస్తారా?

బోడిరెడ్డి నరసింహారెడ్డి, గుత్తి.

## నిర్ణయం మంత్రులదైతే జగన్ నేరమేముంది?

రాష్ట్ర మంత్రి వర్గం నుంచి వైదొలగిన ధర్మాన, సబితలు చెబుతున్నట్లు 26 జి.ఓ విషయంలో నిర్ణయం మంత్రివర్గం సమిష్టిదని తాము ఏ తప్పు చేయలేదని చెబుతున్నారు. నిర్ణయం మంత్రి వర్గ సమిష్టిదైతే వై.యస్.జగన్ దోషి ఎలా అవుతారు. ఏ రోజు సచివాలయం దరిదాపులకు వెళ్ళని వ్యక్తి తాను ముఖ్యమంత్రి కుమారుడనని అధికార దర్పం చూపని వ్యక్తి వై.యస్.జగన్. అటువంటి వ్యక్తిని తప్పుడు కేసులలో ఇరికించి లక్షకోట్ల అవినీతికి పాల్పడ్డట్లు సి.బి.ఐ చెప్తున్న వాదనలో ఎంత మాత్రం పట్టులేదు. జగన్‌ను అరెస్టుచేసి సంవత్సరం కావస్తున్నా, ఇప్పటికీ చార్జిషీట్ల పేరుతో కాలాన్ని వృధాచేస్తూ జగన్ నేరం చేసినట్లు ఒక్క తప్పును కూడా నిరూపించలేని సి.బి.ఐ కేవలం రాజకీయ కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నట్లు అర్థమవుతుంది. కేంద్రం కాంగ్రెస్ అధిష్టానం చెప్పినట్లు నడుస్తూ జగన్‌పట్ల కక్షసాధిస్తున్నారు.

బి.ఆర్.శాలి, కావలి.

## 'ప్రభా'తం

జాతీయ రాజకీయాలలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయి. క్రమ క్రమంగా దేశాన్ని ఎన్నికల వాతావరణం ఆక్రమించేస్తుంది. రాజకీయపార్టీలు ఎప్పుడూ ఎన్నికల మూడ్‌లోనే వుంటాయి. ఓటుబ్యాంకు వేటలో వెంపర్లాడుతుంటాయి. ప్రజలను కూడా అదే వాతావరణంలోకి తెచ్చేందుకు ప్రతి రాజకీయపార్టీ కూడా తనవంతు ప్రయత్నం చేస్తూనేవుంది.

2014 లోక్‌సభ ఎన్నికలకు ప్రతి పార్టీ కూడా సదా సిద్ధంగానే వుంది. అయితే ఎన్నికల కోసం అప్పటిదాకా ఆగాలా... ఇంకొంచెం ముందుగా ఎన్నికలకు పోతేపోలేదా... అనే ఆలోచన కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న యూపిఏలో వుంది. ఈ ఆలోచన ప్రకారం పోతే మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఢిల్లీ, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటే భారత పార్లమెంటుకు కూడా ఎన్నికలుండవచ్చు.


ఎన్నికలన్నాక ప్రతి పార్టీకి కూడా అధికారమే పరమావధిగా మారుతుంది. అయితే ఈ అధికారానికి ఎవరు ఎంత దూరంలో వున్నారన్నది ప్రశ్న! కేంద్రంలోని యూపిఏ ప్రభుత్వంపై ప్రజలు విసిగి వేసారిపోయారు. యూపిఏ ప్రభుత్వం ఈ పదేళ్లలో ప్రజలకు చుక్కలు చూపించింది. వారి బ్రతుకులను నరక ప్రాయంగా మార్చింది. ఇట్లాంటి ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఎన్నుకోవడమనేది ఏ ప్రజాస్వామ్య దేశంలోనూ జరుగదు. కాని మన దేశంలో ప్రజలకు కొంచెం మొరుటుతనం ఎక్కువ. నిండా మునిగాక చలేంటి అనుకునే రకం. కాబట్టి మళ్లీ కాంగ్రెస్‌ను గెలిపించినా ఆశ్చర్యపోనక్కరలేదు. కాకపోతే ఇప్పుడున్న వాతావరణాన్ని బట్టి ఏ పార్టీకి కూడా పూర్తిమెజార్టీ వచ్చే అవకాశం లేదని అన్ని సర్వేలు కోడైకూస్తున్నాయి. కేంద్రంలో ఎవరు అధికారం చేపట్టాలన్నా ప్రాంతీయపార్టీల మద్దతు తప్పనిసరైపోయింది. 1998, 1999, 2004లలో ఎన్నికలు ఎన్డీఏ వర్సెస్ యూపిఏ అన్నట్లుగా జరిగాయి. కాబట్టి ఏదో ఒక కూటమికి పూర్తి మెజార్టీ వస్తూ వచ్చింది. రేపటి ఎన్నికలలో యూపిఏకి గాని ఎన్డీఏకి గాని పూర్తి మెజార్టీ వచ్చే అవకాశాలు ఎంతమాత్రం లేవు. యూపిఏకు బలమైన మిత్రపక్షాలుగా వున్న ఆర్జేడీ, డిఎంకె, తృణమూల్‌కాంగ్రెస్‌లు దూరమయ్యాయి. యూపీఏలో పెద్దపార్టీగా మిగిలివున్నది ఎన్సీపీనే! ఎస్పీ, బిఎస్పీ పార్టీలు బయట నుండి మద్దతునిస్తున్నా అవి యూపిఏ కూటమిలో కలవవు. రాబోయే ఎన్నికలలో అవి కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకునే అవకాశాలు ఎంతమాత్రం లేవు. కాంగ్రెస్‌కు గతంలో వచ్చిన సీట్లకంటే ఇంకా తక్కువ స్థానాలు వస్తాయని 'సర్వే'శ్వరులు చెబుతున్నారు. యూపిఏలో చిన్నాచితకా పార్టీలున్నప్పటికీ ఈ ప్రభుత్వ వైఫల్యాల ప్రభావం ఆ పార్టీలమీద కూడా పడి సీట్ల పరంగా అవి కూడా నష్టపోయే అవకాశాలున్నాయి.

నరేంద్ర మోడీని ప్రచారసారథిగా నియమించాక బీజేపీకి నుడి తిరిగిందని 'సర్వే'ల అంచనా! గతంకంటే బీజేపీకి సీట్లు, ఓట్లు పెరగనున్నాయి. అయితే మోడీ ప్రభంజనం పెద్ద తుఫాన్ అంత బలంగా వీచినా ఎన్డీఏ బలం 200కు మించదు. ఎందుకంటే ఎన్డీఏలో బలమైన పార్టీ బీజేపీనే! కాని ఈ పార్టీ ఇప్పుడు అన్ని రాష్ట్రాలలో లేదు. దక్షిణాదిన పూర్తిగా లేదు. కర్ణాటకలో వుంటే అక్కడా దెబ్బతింది. ఈశాన్యరాష్ట్రాలలో అసలు కనిపించదు. ఉత్తరప్రదేశ్‌లో ఉనికి కోల్పోతుంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, చత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఢిల్లీ వంటి రాష్ట్రాలలో మాత్రమే బీజేపీ మనుగడ వుంది. ఇక్కడ ఎంత ఇరగదీసినా 150సీట్లకు మించి రావు. ఎన్డీఏలో నుండి బలమైన ప్రాంతీయపక్షాలు ఎప్పుడో బయటకుపోయాయి. తాజాగా రెండో పెద్దపార్టీ అయిన దళ్(యు) కూడా బయటకొచ్చేసింది. దీంతో బీహార్‌లోనూ రేపు బీజేపీకి పెద్దగా సీట్లొచ్చే అవకాశాలు లేవు. మహారాష్ట్రలో శివసేన, పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్‌లే ఎన్డీఏలో వున్న పెద్ద మిత్రపక్షాలు. ఈ రెండు పార్టీల కొచ్చే సీట్లు కూడా 20కు మించవు. కాబట్టి బీజేపీకి ఇంకా పెద్ద ప్రాంతీయ పార్టీల పొత్తు ఎంతైనా అవసరం వుంది.

యూపిఏ, ఎన్డీఏలకు ప్రత్యామ్నాయంగా జాతీయస్థాయిలో మూడో కూటమి నిర్మాణం జరుగుతోంది. సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్, అన్నాడిఎంకె, దళ్(యు), బిజూజనతా దళ్, తెలుగుదేశం లేదా వైయస్సార్ కాంగ్రెస్ వంటి పార్టీలు ఈ కూటమిలో వుండబోతున్నాయి. అయితే ఈ ప్రాంతీయపార్టీలన్నీ కలిసినా కూడా మెజార్టీ సీట్లు సాధించడం కష్టమే.

పరిస్థితిని ముందుగానే అంచనా వేసాయి కాబట్టే కాంగ్రెస్, బీజేపీలు ముందుగానే కొత్త మిత్రుల అన్వేషణను మొదలుపెట్టాయి. తమ నుండి దూరమైన పాత మిత్రులకు ప్రేమసందేశాలు పంపుతున్నారు. ప్రాంతీయ పార్టీలను కలుపుకుంటేనే ఏ కూటమికైనా కేంద్రంలో అధికారం సాధ్యమవుతుంది. మంచివూపులో వుండేది సమాజ్‌వాది, దళ్(యు), అన్నాడిఎంకె, తృణమూల్ కాంగ్రెస్, బిజూజనతాదళ్ వంటి పార్టీలే! వీరిలో ఎవరు ఎక్కువ పార్టీలను దగ్గరకు చేర్చుకోగలిగితే వారిదే అధికారం.

### మిత్రులతోనే అందలం




వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో అధికారం చేపట్టడానికి ఏ పార్టీకి గాని, ఏ కూటమికి గాని సంపూర్ణమెజార్టీ వచ్చే అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో ప్రాంతీయపార్టీలు కేంద్రప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషిస్తుండడంతో యూపిఏ, ఎన్డీఏలు కొత్త మిత్రుల వేటలో నిమగ్నమైవున్నాయి.

## 'అంతర్'జాతీయం

- నలుగురు భారత సంతతి అమెరికన్లు (గణితశాస్త్రవేత్త కన్నన్ సౌందరరాజన్, కంప్యూటర్ నిపుణులు రాజీవ్ ఆలూరు, వి.వదన్, గణితశాస్త్రవేత్త సెంథిల్‌లొడారి)లు ప్రతిష్టాత్మక సిమన్స్ ఇన్వెస్టిగేటర్స్ అవార్డులను గెలుచుకున్నారు. ఈ అవార్డు క్రింద వీరికి అయిదేళ్లపాటు ఏడాదికి లక్షడాలర్ల చొప్పున వస్తాయి.
- ఐపిఎల్ స్పాట్ ఫిక్సింగ్ కుంభకోణం కేసులో ఢిల్లీ పోలీసులు మాఫియాడాన్ దావూద్ ఇబ్రహీంపై ఛార్జిషీట్ దాఖలు చేసారు. ఈ కేసులో క్రికెటర్లు శ్రీశాంత్, అజిత్ చండీలా, అంకిత్‌లతో సహా 30మంది నిందితులుగా వున్నారు.
- నరేంద్రమోడీకి వీసా ఇవ్వొద్దంటూ భారత్‌కు చెందిన ఎంపీలు వ్రాసిన లేఖ నిజమైనదేనని అమెరికాలో చేపట్టిన ఫోరెన్సిక్ పరీక్షలలో తేలింది. ఈ లేఖపై తాము సంతకాలు చేయలేదని కొంతమంది ఎంపీలు చేసిన ఆరోపణల నేపథ్యంలో దీనికి ఫోరెన్సిక్ పరీక్షలు చేయించారు.
- ప్రత్యేకతెలంగాణ అంశంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ అగ్రనేత అద్వానీ స్వాగతించారు. ఎన్డీఏ హయాంలో తాము తెలంగాణ ఇవ్వాలనుకుంటే అప్పటి మిత్రపక్షం తెలుగుదేశం అడ్డుపడిందని ఆయన పేర్కొన్నారు.
- దేశంలో పేదరికం లెక్కింపు గణాంకాల్లో లోపాలున్నాయని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా పేర్కొన్నారు. 2005-06లో 37.2 శాతంగా వున్న పేదరికం 2011-12 సంవత్సరానికి 21.9శాతానికి తగ్గిందని ప్రముఖ ఆర్థిక నిపుణులు సురేష్‌టెండూల్కర్ కమిటీ రూపొందించిన గణాంకాలకు ప్రణాళికాసంఘానికి సంబంధం లేదని ఆయన తెలిపారు.
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యూపిఏ కన్నా ఎన్డీఏనే ముందంజలో వుంటుందని టైమ్స్‌నౌ, సీఓటర్, ఇండియాటీవీ సర్వేలు వెల్లడించాయి. ఎన్డీఏకు 156స్థానాలు, యూపిఏకు 131స్థానాలు దక్కుతాయని ఈ సర్వేలు పేర్కొన్నాయి.
- తెలంగాణ ప్రకటన వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక డిమాండ్లకు ప్రాణం పోసింది. ప్రత్యేక గూర్ఖాలాండ్ ఏర్పాటును కోరుతూ గూర్ఖా జనముక్తి మోర్చా నిరవధిక బంద్ నిర్వహించింది.
- బాట్లాహౌస్ ఎదురుకాల్పుల కేసులో దోషిగా నిర్ధారించిన ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది షాజాద్ అహ్మద్‌కు ఢిల్లీ అదనపు సెషన్స్ జడ్జి రాజేంద్రకుమార్ శాస్త్రి జీవితఖైదు, 95వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.
- పశ్చిమబెంగాల్‌లో జరిగిన స్థానిక ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. 17జిల్లాలకు గాను 13జిల్లా పరిషత్తులను తృణమూల్ కైవసం చేసుకుంది. కాంగ్రెస్‌కు 1జిల్లా, వామపక్షాలకు 1జిల్లా దక్కింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- 'తెలంగాణ'ను అంగీకరించేది లేదు. - కేంద్రంపై ములాయం ధ్వజం.
వ్యాఖ్య :- **మా సీమాంధ్ర నేతలకంటే మీరే గట్టిగా వున్నారు.**
వార్త :- తెలంగాణ వస్తే సీఎం పదవి చేపడతా. - దేశం ఎమ్మెల్యే ఎర్రబెల్లి.
వ్యాఖ్య :- **పెళ్లికి సిద్ధంగా వున్నారన్నమాట.**
వార్త :- తెలంగాణ ఇస్తే మరో చత్తీస్‌గఢ్‌లా మారుతుంది. - మాజీడిజిపి స్వరణ్‌జిత్‌సేన్.
వ్యాఖ్య :- **అలా మార్చాలనేగా తెలంగాణ ఇచ్చేది.**
వార్త :- రాష్ట్రంలో దుష్టపాలన నడుస్తోంది. - షర్మిల.
వ్యాఖ్య :- **కేంద్రంలో ఏదో మంచిపాలన నడుస్తున్నట్లు?**
వార్త :- ఎవర్నడిగి రాష్ట్రాన్ని విభజిస్తున్నారు. - బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి.
వ్యాఖ్య :- **ఎవరినీ అడగరు... అదే కాంగ్రెస్ పాలసీ.**
వార్త :- ఢిల్లీలోనే సీమాంధ్ర మంత్రుల మకాం.
వ్యాఖ్య :- **ఒక నెలకు సరిపడా డబ్బులు, బట్టలు కూడా తీసికెళ్లాల్సింది.**
వార్త :- నా రాజీనామా వార్తలు అవాస్తవం. - సీఎం.
వ్యాఖ్య :- **వాస్తవమయ్యే రోజు దగ్గర్లోనే వున్నట్లుంది.**
వార్త :- విభజన జరిగితే నష్టపోయేది కాంగ్రెస్సే. - మాజీమంత్రి కోడెల.
వ్యాఖ్య :- **జరగకపోయినా నష్టపోయేది వారేలే...!**
వార్త :- కేసులుంటే సీటు ఖాయం. - ఏడిఆర్, ఎలక్షన్‌వాచ్ సర్వేలో వెల్లడి.
వ్యాఖ్య :- **కేసుల కోసమైనా నేరాలకు పాల్పడుతారేమో?**
వార్త :- నరేంద్రమోడీపై ఒత్తిడి పెంచండి. - గుజరాత్ కాంగ్రెస్‌నేతలకు రాహుల్ సూచన.
వ్యాఖ్య :- **ఎంత ఒత్తిడి పెంచితే అతనికి అంత మేలు.**
వార్త :- తెలంగాణతో ఎన్నికలకు ముందే రెండు ప్రభుత్వాలు. - రెండుచోట్ల అధికారంలో కాంగ్రెస్.
వ్యాఖ్య :- **రాష్ట్రాన్ని మూడుగా వేసుంటే కాంగ్రెస్ పాలించే రాష్ట్రాల సంఖ్య పెరిగేదిగా!**
వార్త :- మరిన్ని విభజనలు జరక్కుండా చూడాలి. - ప్రకాష్ కారత్.
వ్యాఖ్య :- **అది కాంగ్రెస్ అవసరాన్నిబట్టి ఉంటుంది.**
వార్త :- సీఎం వాదన పట్టని అధిష్టానం.
వ్యాఖ్య :- **అసలు ఆయన వున్నాడనేది గుర్తుంటేగా..?**

PDF Compressor Free Version



# పురపాలక యుద్ధానికి రిజర్వేషన్లు సిద్ధం

నెల్లూరు జిల్లాలో నెల్లూరు నగర పాలకసంస్థతో పాటు అయిదు మునిసి పాలిటీలు నాయుడుపేట నగర పంచా యతీ ఎన్నికలకు ప్రభుత్వం రంగంసిద్ధం చేస్తోంది. ఆయా మునిసిపాలిటీల్లో కేట గిరీల వారీగా రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేశారు. ప్రభుత్వ అనుమతితో రిజర్వేషన్ల వివరాలను అధికారికంగా ప్రకటించారు.

నెల్లూరు నగరపాలక సంస్థలోని 54 డివిజన్లలో ఏ కేటగిరి క్రింద ఏ డివిజన్ వస్తుందనేది ఇంకా వెల్లడించనప్పటికీ ఏ కేటగిరికి ఎన్ని డివిజన్లనేది కేటాయించారు. ఎస్టీ జనరల్‌కు 2 డివిజన్‌లు, ఎస్టీమహిళకు ఒక డివిజన్, ఎస్సీ జనరల్‌కు 4డివిజన్‌లు, ఎస్సీ మహిళకు 3డివిజన్‌లకు, బీసీ జనరల్ క్రింద 9డివిజన్‌లు, బీసీ మహిళకు 9డివి జన్‌లు, ఓసి జనరల్‌కు 12డివిజన్‌లు, ఓసి మహిళకు 14 డివిజన్‌లు కేటాయించారు.

**గూడూరు:** మొత్తం వార్డులు 33. ఎస్.టి (జనరల్) 15వవార్డు, ఎస్సీ(మహిళ) 19, 23, 10 వార్డులు, ఎస్సీ(జనరల్) 8, 31, 29, బీసీ (మహిళ) 3, 30, 2, 12, 9, బీసీ(జనరల్) 24, 4, 32, 13, 28, 11, జనరల్(మహిళ) 22, 6, 18, 16, 14, 33, 26, 17, జనరల్ 1, 5, 7, 25, 20, 21, 27.

**కావలి:** మొత్తం వార్డులు 40. ఎస్.టి (మహిళ) 16వవార్డు, ఎస్టీ(జనరల్) 36, 6 వార్డులు, ఎస్సీ (మహిళ) 11, 10, 17, ఎస్సీ(జనరల్) 14, 12, 22, బీసీ (మహిళ) 32, 7, 8, 24, 5, 1, బీసీ (జనరల్) 39, 35, 40, 38, 2, 15, 3, జనరల్ (మహిళ) 33, 27, 25, 31, 26, 18, 20, 19, 28, 13, జనరల్ 37, 30, 34, 4, 29, 9, 21, 23.

**వెంకటగిరి:** మొత్తం వార్డులు 25. ఎస్.టి (జనరల్) 1వవార్డు, ఎస్సీ(మహిళ) 12, 5వార్డులు, ఎస్సీ (జనరల్) 7, 1, బీసీ (మహిళ) 6, 17, 14, 19, బీసీ (జనరల్) 18, 21, 11, 10 జనరల్(మహిళ) 20, 13, 23, 15, 8, 9, జనరల్ 22, 3, 2, 24, 16, 25.

**ఆత్మకూరు:** మొత్తం వార్డులు 23. ఎస్.టి (మహిళ) 18వ వార్డు, ఎస్టీ(జనరల్) 15, ఎస్సీ(మహిళ) 12, 22, ఎస్సీ(జనరల్) 13, 19, బీసీ(మహిళ) 11, 5, 14, 7, బిసి(జనరల్) 16, 4, 17, 3, జనరల్ (మహిళ) 8, 10, 20, 23, జనరల్ 6, 9, 21, 7, 1.

**సూళ్ళూరుపేట:** మొత్తం వార్డులు 23. ఎస్టీ(జనరల్) 19వవార్డు, ఎస్సీ(మహిళ) 6, 15, ఎస్సీ(జనరల్) 16, 5, 18, బిసి (మహిళ) 3, 23, 1, 22, బిసి (జనరల్) 17, 22, 4, 20, జనరల్(మహిళ) 4, 10, 12, 11, 2,జనరల్ 8, 7, 13, 9.

**నాయుడుపేట:** మొత్తం వార్డులు 20. ఎస్టీ(మహిళ) 11వవార్డు, ఎస్టీ(జనరల్) 12, ఎస్సీ(మహిళ) 2, 20, ఎస్సీ(జనరల్) 14, 19 బిసీ(మహిళ) 13, 9, 17, బిసి (జనరల్) 5, 8, 15, 16 జనరల్(మహిళ) 4, 6, 7, 10, జనరల్ 1, 3, 18.

# జైఆంధ్రా ఉద్యమం కల నెరవేరింది

## రాష్ట్ర విభజనను స్వాగతించిన సీమాంధ్ర విద్యార్థి జేఏసీ



రాష్ట్ర విభజనను స్వాగతిస్తూ జూలై 31న సీమాంధ్ర యువజన విద్యార్థి జేఏసీ నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి బొమ్మ దగ్గరగల జై ఆంధ్ర అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించింది. తదుపరి సీమాంధ్ర యువజన విద్యార్థి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ముక్కు రాధాకృష్ణగౌడ్ మాట్లాడుతూ సమైక్యవాదానికి స్వస్తి పలికి సీమాంధ్ర రాష్ట్రం ఏర్పాటుద్వారా రాష్ట్రాభివృద్ధికి వనరులు సాధించుకునే విధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీలకతీతంగా కృషిచేయాలని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధిలో జపాన్, సింగపూర్, మలేషియాలాగా తయారుచేయాలని అన్నారు. కార్యక్రమంలో సీమాంధ్ర యువజన విద్యార్థి జేఏసీ రాష్ట్ర కోకన్వీనర్ జంపాని, ఆనంద్ గౌడ్, సర్వేపల్లి అసెంబ్లీ కన్వీనర్ ఆలూరు ప్రద్యుమ్నారెడ్డి, ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి జిల్లా యువజన అధ్యక్షులు కొల్లి మధుబాబుయాదవ్, అధికార ప్రతినిధి రెబ్బా పాపారావు, రాష్ట్ర యువజన అధ్యక్షత కె.జయకుమార్ మిత్ర, మహిళా నాయకులు అవుల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 300 'మీసేవ' కేంద్రాల ఏర్పాటు లక్ష్యం



నెల్లూరు జిల్లాలో సెప్టెంబరులోగా 300"మీసేవ" కేంద్రాలు ఏర్పాటు లక్ష్యంగా నిర్దేశించినట్లు నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జేసి వివిధశాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 230 మీసేవ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ఏపీ ఆన్‌లైన్ ద్వారా మరో 50కేంద్రాలు, హెచ్‌సీఎల్ ద్వారా 20కేంద్రాలను నూతనంగా ఏర్పాటుచేయనున్నామన్నారు. జిల్లాలోని 46తహశీల్దార్ కార్యాలయాల్లో శాశ్వత ఆధార్ కేంద్రాలను ఆగష్టు 15వతేదీలోగా ఏర్పాటుచేయనున్నామన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే గ్యాస్ వినియోగదారుల వద్ద ఆధార్ నెంబర్లు, బ్యాంక్ నంబర్లును సేకరించి సీడింగ్ ప్రక్రియను సెప్టెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి ఆధార్ నంబరు కలిగి ఉంటేనే ఉపకారవేతనం పొందుతారని జేసీ తెలిపారు. ఆధార్ నెంబరును ఆయా కళాశాలల్లో అందజేయాలన్నారు.

# రాష్ట్ర విభజనకు ఇంజనీర్ల నిరసన




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయడానికి సిద్ధపడిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయానికి వ్యతిరేకంగా జూలై 31న ది కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్, ఆర్కిటెక్ట్స్ అండ్ ఎల్‌బిఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నెల్లూరులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరాం బాబురావు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలని కోరారు. కార్యదర్శి విజయప్రసాద్ మాట్లాడుతూ ఆగష్టు 2న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో ఉపాధ్యక్షులు విరవు లలితారామ్, సభ్యులు శ్రీనివాసకుమార్, ఆసిఫ్‌ఖాన్, కె.వి.సుబ్బారెడ్డి, పి.ఓంప్రకాష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 25లక్షల రేషన్ బియ్యం పట్టివేత

నెల్లూరు నగరంలోని శెట్టిగుంటరోడ్డులో ఉన్న లక్ష్మీపద్మావతి రైసుమిల్లుపై బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడిచేసి అక్రమంగా నిల్వఉంచిన 25లక్షలు విలువగల బియ్యం, ధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ శశిధర్‌రాజు, డిఎస్పీ రమేష్‌బాబు, సిఎస్‌డిటి హమీద్ నేతృత్వంలో దాడులు నిర్వహించారు. రైసుమిల్లులో అక్రమంగా నిల్వవేసి ఉన్న 50కేజీలు ఉన్న 205బస్తాలను ప్రజా పంపిణీ బియ్యంను గుర్తించారు. ఈ బియ్యంను ఒంగోలు నుంచి తరలించినట్లు అధికారులు గుర్తించారు. సన్నరకం బియ్యం 25కేజీలు ఉన్న 518బస్తాలు, ధాన్యం 106టన్నులు, నూకలు 850కేజీలను స్వాధీనం చేసుకున్నారు. సరుకులు సీజ్‌చేసి నిర్వాహకులపై 6ఎ కేసులు నమోదు చేసారు.

# మళ్ళీ పెట్రో వాత...

## లీటరు పెట్రోలుపై 92పైసలు, డీజిల్‌పై 62పైసలు పెంపు

కేంద్ర ప్రభుత్వం వాహనదారులపై మళ్ళీ పెట్రోల్‌ధరలను లీటర్‌పై 92పైసలు, డీజిల్‌పై 62పైసలు పెంచి వాతపెట్టింది. దీంతో వాహనదారులు నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. పెరిగిన ఈ ధరలు బుధవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చాయి. నెల్లూరుజిల్లాపై పెట్రోభారం నెలకు 41.40లక్షలుపడింది. జిల్లాలో పెట్రోలు నెలకు 4500కిలో లీటర్ల వాడకం జరుగుతోంది. అదే విధంగా డీజిల్‌పై నెలభారం 1.86 కోట్లుపడింది. జిల్లాలో డీజిల్ 30వేల కిలోలీటర్లు వాహనదారులు వినియోగిస్తున్నారు. ఈ పెంపుతో వాహనదారులు లబోదిబోమంటున్నారు.

# గూడూరు వైకాపాలో విజయోత్సవాలు


గూడూరు మండలంలో 23పంచాయతీలు ఉండగా కాంగ్ర పంచాయతీ ఏకగ్రీవం అయ్యింది. 22పంచాయతీలలో వైయస్ఆర్‌సిపి 8పంచాయతీలు కైవసం చేసుకొంది. కాంగ్రెస్-5, టీడీపి -7, ఉమ్మడి-1, స్వతంత్ర-1 పంచాయతీలని దక్కించుకున్నారు. అలాగే చిల్లకూరు మండలంలో 31పంచాయతీలుండగా 5ఏకగ్రీవంకాగా 26లో వైయస్సార్సీపీ -6, టిడిపి -6, కాంగ్రెస్-12పంచాయతీలు దక్కించుకున్నాయి. వైయస్సార్సీపీ 5మేజర్ పంచాయతీలు హస్తగతం చేసుకోవడంతో వైయస్సార్సీపీ కేంద్ర కమిటీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు కలిసి గూడూరులో వివిధ పంచాయతీలలో విజయోత్సవాలు జరుపుకున్నారు.

# కొత్త రాజధాని ఎక్కడ?

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అయితే దీనికి అవకాశాలు తక్కువ. కర్నూలు దాదాపు తెలంగాణ సరిహద్దుల్లో వుంది. ఉత్తరాంధ్ర జిల్లాలకు చాలా దూరంగా వుంది. అదీగాక రైల్వే వసతి తక్కువ. రవాణాకు అంత సౌకర్యంగా లేదు. ఎయిర్‌పోర్ట్ కూడా లేదు. ఆంధ్ర రాష్ట్రానికి తొలిరాజధానిగా ఈ నగరమే వుండింది. అయితే అనాడున్న పరిస్థితులు వేరు. నేటి పరిస్థితులు వేరు. రాజధానికి మౌలికవసతులు తప్పనిసరయ్యాయి. కాబట్టి రాజధానిరేస్‌లో కర్నూలు నిలిచేది కష్టమే. తిరుపతి ఆధ్యాత్మిక కేంద్రం. ఇక్కడ ఎయిర్‌పోర్ట్ వుంది. మిగతా వాటికీ అనుకూలమే. రైల్వేపరంగా రవాణా వసతి బాగుంది. కాకపోతే రాష్ట్రానికి ఒక చివర అవుతుంది. అదీగాక తిరుపతిలో రాజధానిని ఏర్పాటు చేస్తే తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లే అవకాశం కూడా వుంది. ఉత్తరాంధ్ర వారికి విశాఖపట్నంను రాజధానిని చేయాలనివుంది. వారికి ఇది అనుకూలమైన నగరం. అటు శ్రీకాకుళం నుండి ఇటు విజయవాడ వరకు అయితే వైజాగ్ బాగుంటుంది. కాని దక్షిణకోస్తా, రాయలసీమ జిల్లాల వారికి మాత్రం దూరమవుతుంది. వైజాగ్‌లో ఎయిర్‌పోర్ట్, సీపోర్ట్ వున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన నగరం. కాకపోతే ప్రభుత్వ భూములు తక్కువ. తెలుగు సినీపరిశ్రమ కూడా హైదరాబాద్ నుండి మారాల్సివస్తే విశాఖకే రావచ్చు. కాని వైజాగ్ అంటే రాయలసీమవాళ్లు ఒప్పుకునే అవకాశాలు లేవు. ఏలూరును రాజధాని చేయాలనే ప్రతిపాదనను కూడా అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ఇక్కడ ఎయిర్‌పోర్ట్, సీపోర్ట్ లేవు. ప్రభుత్వ భూములు అంతకన్నా లేవు. 15వేల ఎకరాల అటవీ భూములున్నాయి. కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకుని కొత్త రాజధానిని ఇక్కడ ఏర్పాటు చేయదలిస్తే ఆ భూములనే వినియోగించాల్సి వుంటుంది. విజయవాడ - గుంటూరు జంట నగరాల మధ్య రాజధాని అనేది ఎప్పటినుండో వున్న ప్రచారం. విజయవాడకు దగ్గర్లో మచిలీపట్నం సీపోర్ట్ వుంది. గన్నవరం ఎయిర్‌పోర్ట్ వుంది. కాని ఇక్కడ ప్రభుత్వం భూములు లేకపోవడంతో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌ను విస్తరించడానికి కూడా వీలుకావడం లేదు. ప్రభుత్వ భూములు దొరకనప్పుడు కొత్త రాజధానిని ఇక్కడ ఏర్పాటు చేయడం కష్టమే! గుంటూరును కేంద్రంగా చేసుకుని విజయవాడను కలుపుతూ కొత్త రాజధాని ఏర్పాటుకు కొంత మార్గం సులభం కావచ్చు. కాని ఇరుప్రాంతాల వారికి ఆమోద యోగ్యమైన ప్రాంతంగా ఒంగోలు ప్రచారంలో వుంది. అటు రాయలసీమ వారికి, ఇటు కోస్తా జిల్లాలకు అందుబాటులో వుంటుంది. శ్రీకాకుళం, వైజాగ్, విజయ నగరం జిల్లాల వారికి తప్పితే మిగతా జిల్లాలవారికి దగ్గరగానే వుంటుంది. ప్రభుత్వ భూములు కూడా తగినంతగా వున్నాయి. నీటి సమస్య వుంది గాని, సాగర్ జలాలను మళ్లించుకోవచ్చు. ఎయిర్ పోర్ట్, సీపోర్ట్ లేవు. కాకపోతే ఒంగోలు- నెల్లూరుల మధ్య అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నెలకొల్పితే అనువుగా వుంటుంది. ఇప్పుడు రాజధానికి వినిపిస్తున్న పేర్లలో ఒంగోలు ఎక్కువగా ప్రచారంలో వుండడం విశేషం.

# నెల్లూరు కబుర్లు



## విషాదంలో వివేకా

రాష్ట్ర విభజన ఖాయమని తేలడంతో నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి విషాదంలో మునిగిపోయారు. మంగళవారం కోర్‌కమిటీ, సిడబ్ల్యుసి భేటీకి ముందురోజే తెలంగాణ ఇస్తున్నారనే విషయం వివేకాకు తెలిసిపోయింది. దాంతో ఆయన మూడ్ మారిపోయి మానసిక ఆందోళనకు లోనయ్యాడు. కళ్లల్లో నీళ్లు కూడా తిరగసాగాయి. కరడుకట్టిన సమైక్యవాది ఆయన. వాళ్ల కుటుంబం కూడా విశాలాంధ్రకే మొదటినుండి మద్దతుగా వుండేది. జైఆంధ్రా ఉద్యమంలో వేలాదిమంది ఆందోళనకారులు తమ ఇంటిని చుట్టిముట్టిన సమయంలో కూడా వారు సమైక్యాంధ్ర విషయంలో వెనక్కు తగ్గలేదు. ఇన్నాళ్లు ఒక్కటిగా వున్న తెలుగుజాతి రెండుగా విడిపోతుండేసరికి, అది కూడా తమ కాంగ్రెస్‌పార్టీ మూలంగా జరుగుతుండేసరికి వివేకాలో అంతులేని విషాదం నెలకొంది.

## ఆనంను కలిసిన సర్పంచ్‌లు

కాంగ్రెస్‌పార్టీ మద్దతుతో మొదటి, రెండో విడత పంచాయితీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచ్‌లు జూలై 29న నెల్లూరు రంగనాయకులపేటలోని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసంలో ఆయనను గౌరవపూర్వకంగా కలిసారు. మంత్రి ఆనం వారిని అభినందిస్తూ మూడో విడత ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంలో కాంగ్రెస్ నాయకులు చేవూరు దేవకుమార్ రెడ్డి తదితరులు హర్షం ప్రకటించారు.



జూలై 29వ తేదీన నెల్లూరులోని తన ఇంట్లో కాంగ్రెస్ మద్దతుతో సర్పంచ్‌లుగా ఎన్నికైనవారిని అభినందిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి

## జ్ఞాపకశక్తి పెంపుదలకు పద్ధతులెన్నో!



నెల్లూరు రోటరీక్లబ్ ఇటీవల తలపెట్టిన జ్ఞాపకశక్తి పెంపుదలపై ఉచిత శిక్షణ జూలై 6వతేదీ నుండి 26వతేదీ వరకు నిర్విరామంగా జరిగింది. నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాలయం, సెయింట్ జోసెఫ్ స్కూలు, శాస్త్రఎంబిఏ కళాశాల తీర్థ స్కూలు, రోటరీ ఆడిటోరియంలలో దాదాపు 1100మంది విద్యార్థులకు రొటేరియన్ సనత్‌కుమార్‌రెడ్డి దిగ్విజయంగా శిక్షణనిచ్చారు. ఎస్‌క్యూత్రీఆర్ ఫార్ములాలో చదివే పద్ధతి, పునశ్చరణ పద్ధతులు, కష్టమైన విషయాలను గుర్తుపెట్టుకోవడానికి అక్రోనిమ్ పద్ధతి ద్వారా జ్ఞాప్తి చిహ్నాలను ఏర్పరచుకోవడం, ఎక్కువ పదాలను ఒకేసారి గుర్తుపెట్టుకోవడానికి లింక్ పద్ధతి, పెద్దసంఖ్యలను గుర్తుపెట్టుకోవడానికి పెగ్‌సిస్టమ్ తదితర పద్ధతులలో సాగే ఈ శిక్షణ విద్యార్థులకు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగపడుతుందని ఈ శిక్షణను వివిధ విద్యాసంస్థలు ఉపయోగించుకోమని నెల్లూరు రోటరీక్లబ్ ప్రెసిడెంట్ టి.శేఖర్ కోరుతున్నారు. వివరాల కోసం 94418 54387లో సంప్రదించమని, ఈ శిక్షణను సంవత్సరం పొడవునా ఇవ్వడానికి తాము సిద్ధంగా వున్నామని తెలిపారు.

## స్టేడియం వాకర్స్ వితరణ



నెల్లూరు కొండాయపాలెం దళితవాడలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ జూలై 27న నోట్‌బుక్స్ పెన్సిళ్లు, రబ్బర్లు, స్కేళ్లు, లడ్డూలు, చాక్లెట్లు పంపిణీ చేసారు. దాతలు యం.సి.కృష్ణయ్య 3సీలింగ్ ఫ్యాన్లు, ఎ.భాస్కర్‌రెడ్డి, పిఎస్ ప్రసాద్ చెరొక సీలింగ్ ఫ్యాను స్కూలుకు వితరణ చేసారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ రాఘవేంద్రశెట్టి, వి.హజరత్‌బాబు, డా॥పి.నాగేశ్వరరావు, పి.రవిచంద్ర, ఎస్.మోహన్‌లు నోటుబుక్స్ తదితర సామాగ్రిని సమకూర్చగా, లడ్లు, చాక్‌లెట్స్ డా॥ దొరస్వామినాయుడు, అసోసియేషన్ కార్యదర్శి ఎన్.బలరామయ్యానాయుడులు వితరణ చేసారు. తదుపరి విశ్వోదయ అంధుల పాఠశాలలోని విద్యార్థులకు అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు బి.సుందరరామిరెడ్డికుమారుడు బి.వి.కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం దుప్పట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వాకర్స్ బి.శేషగిరిరావు, కె.గోవిందయ్య, డా॥యంయస్‌రెడ్డి, డి.రమణయ్య, నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.భాస్కరరావు, ఉపాధ్యాయుడు ఏ.హరి తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి జిల్లా ఇన్‌ఛార్జిగా భానుప్రకాష్



భారతీయ జనతాపార్టీ జిల్లా ఇన్‌ఛార్జిగా చిత్తూరు జిల్లాకు చెందిన భానుప్రకాష్‌ను నియమించారు. భానుప్రకాష్ తిరుపతి నివాసి, ప్రస్తుతం రాష్ట్ర అధికార పార్టీ ప్రతినిధిగా ఉన్నారు. ఎన్నికల్లో పార్టీ గెలవడానికి భానుప్రకాష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులను చైతన్య పంచనున్నారు.

## వైద్యులకు సత్కారం

నెల్లూరు ప్రగతి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని పలువురు వైద్యులను సత్కరించారు. ఆచారివీధిలోని ఒక హోటల్ కాన్ఫరెన్స్‌హాలులో సోమవారం క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. మల్టిపుల్ కౌన్సిల్ మాజీ కార్యదర్శి ఎం.సుధాకర్‌రెడ్డి కార్యవర్గంతో, సభ్యులతో క్లబ్ మాజీగవర్నర్ డిఎస్.కుమార్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా బిటెక్ విద్యార్థికి స్కాలర్‌షిప్ పేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేసారు. డాక్టర్ కె.ఎస్.జీ షబ్బీర్ సారధ్యంలో డాక్టర్లు టి.కృష్ణమూర్తి, పి.మధుసూదన్‌శాస్త్రి, పి.చంద్రశేఖర్, ఆర్.జగన్మోహన్‌రావు, ఎం.పెంచలరెడ్డి, పి.వీ.నరసింహమూర్తిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీ తాజుద్దీన్ తులసీ సుధాకరరావు, టి.రామకృష్ణ, జాఫర్, ఇంతియాజ్, ఎస్.ఎం.రసూల్ పాల్గొన్నారు.

## ఇరుకళల అమ్మవారికి శాఖాంబరి అలంకారం

నెల్లూరు నగరం మూలాపేటలో వెలసియున్న సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం శాఖాంబరి (కూరగాయలు, పండ్లు) అలంకారోత్సవం వైభవంగా జరిగింది. పాడిపంటలు బాగా పండి ప్రజలంతా సుఖసంతోషాలతో విలసిల్లాలని కోరుతూ ఈ అలంకారాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎవి శ్రీనివాసులు రెడ్డి, ఆలయ మాజీచైర్మన్ సూరిశెట్టి నరేంద్ర, మాజీసభ్యులు నేతృత్వంలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని పొంగళ్ళు పెట్టుకుని పూజలు నిర్వహించారు.

## రవీంద్రరెడ్డి సేవలు ప్రశంసనీయం



రవీంద్రరెడ్డిని సత్కరిస్తున్న ఆనం వివేకా, రాజీయాడ్స్ పెంచలయ్య, చాట్ల నరసింహారావు తదితరులు

నెల్లూరు నగరం విఆర్ కళాశాలలో 35సంవత్సరాల పాటు విద్యార్థులకు ఫిజిక్స్ సైన్సులో చక్కని బోధనచేసి విద్యార్థుల ఉన్నతికి కృషిచేసిన రవీంద్రరెడ్డి ప్రశంసనీయుడని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పేర్కొన్నారు. గత నెలలో పదవీవిరమణ చేసిన కందల రవీంద్రరెడ్డి దంపతులను సోమవారం విఆర్‌సిలో సత్కరించారు. కళాశాల అధ్యాపకబృందం, స్నేహితులు రవీంద్రరెడ్డి దంపతులను సత్కరించారు.

## విశ్వసాయి మంచిమనసు



విరాళాన్నందజేస్తున్న డా॥ యన్.సత్యనారాయణ

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాల ఛైర్మన్ డా॥యన్.సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ జి.కృష్ణమోహన్, జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్, విద్యార్థులు తమ మంచిమనసును చాటుకున్నారు. వారు గత నెల 28న కాలేయవ్యాధితో బాధపడుతున్న విద్యార్థిని కర్ణం విమలకు వైద్యసహాయం కోసం రూ.50,000/- అందించారు. ఈ సందర్భంగా డా॥యన్.సత్యనారాయణ మాట్లాడుతూ సమాజసేవలో తమ కళాశాల పాలుపంచుకుంటుందని, ఏదైనా సహాయార్థం తమ కళాశాల జియం రాజేష్‌కుమార్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జితేంద్ర, అధ్యాపకులు బాలాజీ, దీపు, ఏ.ఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ విద్యార్థినికి ప్రతిభా అవార్డు



అర్షియాయాస్మిన్‌ను అవార్డునందజేస్తున్న కలెక్టర్ శ్రీకాంత్

నెల్లూరు విజయమహాల్ గేట్ దగ్గరగల శ్రీ నేతాజీ (యం.యస్.ఆర్) పైలట్ హైస్కూలులో 2012-13 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన షేక్ అర్షియాయాస్మిన్ పరీక్షా ఫలితాల్లో 10పాయింట్లకు 10పాయింట్లు సాధించిన విషయం విదితమే. ఆ విద్యార్థిని ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా అవార్డును ప్రకటించిందని స్కూలు కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఇటీవల జరిగిన కార్యక్రమంలో నెల్లూరుజిల్లా కలెక్టర్ శ్రీకాంత్ నుంచి విద్యార్థిని యాస్మిన్ ప్రతిభా అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

PDF Compressor Free Version





జూలై 31న సమైక్యాంధ్ర మద్దతుదారుల బంద్ సందర్భంగా నెల్లూరు నగరంలో నిలిచిపోయిన ఆటోలు, వాహనాలు

# పారిశుధ్యంపై దృష్టి పెట్టండి

సింహపురి సమాచారం

## --- మున్సిపల్ కమీషనర్లతో జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ ---



నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని మున్సిపల్ కమీషనర్ ఛాంబర్‌లో జూలై 26న జరిగిన కమీషనర్ల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై నివేదికలను తయారుచేసి చూపాలని కమీషనర్లు ఆయా మున్సిపాలిటీలలో నెలలో అన్ని వార్డులు తనిఖీ చేయాలని పేర్కొన్నారు. వీధులలో నడిచి వెళ్ళడం చేస్తే ఆ ప్రాంత ప్రజల సాధకబాధకాలు తెలుసుకునే వీలుకలుగుతుందన్నారు. పారిశుధ్య పనులను, చెత్తాచెదారం తొలగింపును పర్యవేక్షించే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తగిన కారణం లేకుండా గైర్హాజరు కారాదన్నారు. మున్సిపల్ కమీషనర్లు ఆయా వార్డులలో పర్యటించే సమయంలో స్వయంగా హాజరు పట్టీలో అటెండెన్స్ వేయాలని సూచించారు. కంపోస్టుయార్డులను ప్రజలకు ఇబ్బంది కలగకుండా దూరంగా ఏర్పాటుచేసి వాహనాల ద్వారా చెత్తను అక్కడకు చేరవేయాలన్నారు. కార్పొరేషన్‌లోని అన్ని వార్డులలో పారిశుధ్యం, నీటిసౌలభ్యత, వీధిదీపాలకనెక్షన్లు మున్సిపల్ కమీషనర్లు స్వయంగా పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అళగల వర్షిణి, డిఆర్వో వి.రామిరెడ్డి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌చార్జి కమీషనరు శ్యామ్‌సన్, వెంకటగిరి, నాయుడుపేట, గూడూరు, సూళ్ళూరుపేట, ఆత్మకూరు, కావలి మున్సిపల్ కమీషనర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# సైన్స్‌లో కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం

## ఆచార్య డీఎన్ రెడ్డి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆచార్య డీఎన్‌రెడ్డి

యువత ఇంజినీరింగ్, మెడిసిన్‌పై మాత్రమే కాకుండా సైన్స్ రంగంలో కొత్త ఆవిష్కరణలవైపు దృష్టిసారించి సమాజానికి ఉపయోగకరమైన పరిశోధనలు చేయాలని జెఎన్‌టియు మాజీ ఉపకులపతి ఆచార్య డిఎన్‌రెడ్డి పిలుపునిచ్చారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరులో ఆదివారం నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిశోధనలతోనే అన్ని రకాల ఫలితాలు ఉంటాయని ఉపగ్రహ సంకేతాల ద్వారా పంటలు పండించే విధానం, వాతావరణ మార్పులపై అధ్యయనాలు ఊపందుకున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వియస్‌యూ ఉపకులపతి ఆచార్య జి.రాజారామిరెడ్డి మాట్లాడుతూ గణితం, ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, ఎర్త్ సైన్సెస్ తదితర శాస్త్ర అధ్యయనాలను విద్యార్థులు విస్మరించడం శోచనీయమన్నారు. గౌరవఅతిథిగా పాల్గొన్న ఆంధ్రావిశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఎన్.వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ పిల్లల మనోభావాలను బట్టి వారిని ప్రోత్సహించాలన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య హరగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మనదేశంలో 11శాతం మంది విద్యార్థులు మాత్రమే పరిశోధనల వైపు దృష్టి సారిస్తున్నారని అదే పాశ్చాత్య దేశాల్లో 83 శాతం విద్యార్థులు ఆ దిశగా వెళుతున్నారన్నారు. వియస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేస్తే భావిభారత శాస్త్రవేత్తలుగా రూపొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎం.శ్రీనివాసులరెడ్డి, ఎస్.కె.విశ్వవిద్యాలయం ఉపకులపతి డా॥కె.రామకృష్ణారెడ్డి, నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య రామసుబ్బయ్య, సాఫ్ట్‌వేర్‌సంస్థల ప్రతినిధులు ప్రతాప్‌రెడ్డి, నందకుమార్‌రెడ్డి, ఎన్.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగపతి డా॥ కె.నరసింహారావు రచించిన ఇన్‌స్పైరింగ్ ది యంగ్ మైండ్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

# శ్రీ సిటీకి జపాన్ మాజీ రాయబారి సేవలు




శ్రీ సిటీ ప్రత్యేక ఆర్థికమండలి సలహాదారుడిగా జపాన్‌కు చెందిన మాజీభారత రాయబారి యాసుకుని ఎనోకి బాధ్యతలు చేపట్టారు. 2003-2007 మధ్యకాలంలో భారత రాయబారిగా పనిచేసిన ఎనోకి శ్రీసిటీలో జరుగుతున్న అభివృద్ధి, జపాన్ పరిశ్రమలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆకర్షితులైన ఆయన ఈ బాధ్యతలు చేపట్టారు. మరిన్ని జపాన్ పరిశ్రమలు ఏర్పడదానికి సంధానకర్తగా ఆయన వ్యవహరించనున్నారు.

# ఎన్నికల్లో పోలీసుకు పుడ్డు, బెడ్డు కరువు



నెల్లూరు జిల్లాలో దాదాపు ఎనిమిదేళ్ళ తర్వాత ప్రతిష్ఠాత్మకంగా గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంతో పోలీసుల పాత్ర చెప్పుకోదగింది. శాంతిభద్రతల పర్యవేక్షణలో వారిదే కీలకపాత్ర. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకునే వీరికి ఆకలి తిప్పలు తీరడంలేదు. పస్తులతో అల్లాడారు. సరైన వసతిలేక ఎక్కడంటే అక్కడే సేదతీరారు. మూడువిడతల్లో జూలై 23, 27, 31తేదీల్లో జరిగిన పోలింగ్‌లో శాంతిభద్రతల పర్యవేక్షణలో 3,067మంది పోలీసులు పాల్గొన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులతో పాటు నెల్లూరుజిల్లా పోలీసు సిబ్బందికి సక్రమంగా అన్నపానీయాలు అందించడంలో జిల్లా అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాల గురించి ఎవ్వరూ పట్టించుకోలేదు. స్థానిక నేతలు అందించిన పెరుగన్నం పులిహోరతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. పంచాయతీ ఎన్నికల బందోబస్తుకు వెళ్ళే సిబ్బందికి మూడు విడతల ఎన్నికల్లో పాల్గొనే వారికి ప్రభుత్వం జిల్లాకు 98లక్షలు ఎన్నికల బడ్జెట్‌ను కేటాయించింది. ఈ మొత్తాన్ని ఎస్సై నుంచి డీఎస్పీ వరకు 2136, కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు 1600రూ॥లు హోంగార్డులకు వెయ్యి రూపాయలు కేటాయించారు. విధుల్లో భాగంగా వారు జూలై 21నుంచి ఆగస్టు నెల 2వతేదీ వరకు విధులు నిర్వహించాల్సి వచ్చింది. కాని ఈ నగదు ఏ మాత్రం సరిపోవడంలేదని విమర్శలు వినవస్తున్నాయి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సక్రమంగా విధులు నిర్వర్తించడమే పోలీసుల విధి అని చెప్పుకోవడం వాస్తవం.

# వైద్యశాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి


నెల్లూరు జిల్లాలో కొనసాగుతున్న నర్సింగ్‌హోంలు, క్లినిక్‌లు తక్షణమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేని పక్షంలో నర్సింగ్‌హోంయాక్ట్ ప్రకారం ఇటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని సీజ్‌వేయడం జరుగుతుందని, ఆర్‌ఎంపిలు, పిఎంపిలు ఎటువంటి క్లినిక్‌లు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి జి.సుధాకర్ పేర్కొన్నారు. జిల్లాలో ఎటువంటి అనుమతులు లేని, అనుమతి కాలపరిమితి అయిపోయిన ల్యాబ్‌లు, క్లినిక్‌లు, నర్సింగ్ హోంలు నిర్వహించరాదని, ఫస్ట్ ఎయిడ్ చికిత్సలు నిర్వహించుకోవచ్చన్నారు. బిఏయంయస్ (ఆయుర్వేదం), ఆర్ హెచ్‌ఎంఎఫ్(హోమియో) వైద్యులు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నర్సింగ్‌హోంలు నిర్వహించరాదన్నారు.

# పవిత్రమైన వృత్తి నర్సింగ్



జ్ఞాపికనందుకుంటున్న ఎస్‌ఎం వైట్

పవిత్రమైన వృత్తి నర్సింగ్ అని అంతర్జాతీయ ప్రసంగీకులు ఎంఎస్ వైట్ అన్నారు. నెల్లూరు రూరల్ మండలం చింతారెడ్డిపాళెం పరిధిలోని నారాయణ ఆసుపత్రిలోని ఆడిటోరియంలో జూలై 27న నర్సింగ్‌పై జాతీయ సదస్సు ముగింపుసభ జరిగింది. నర్సింగ్ విద్యార్థులనుద్దేశించి వైట్ మాట్లాడుతూ రోగులందరిపట్ల ఆదరణభావంతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా నారాయణ నర్సింగ్ డీన్ ఇందిర ఎస్‌ఎంవైట్‌కి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు డా॥ లక్ష్మి, వి.విజయలక్ష్మి, విఘ్నేష్, నర్సింగ్ కళాశాలకు చెందిన వసంతకుమారి, గుంటూరు సిమ్స్ నర్సింగ్ కళాశాలకు చెందిన పి.పద్మశ్రీ, నర్సింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఆ ఘోరకలికి యేడాది

సరిగ్గా సంవత్సరం క్రితం 2012వ సంవత్సరం జూలై నెల 30వ తేదీ తెల్లవారుజామున 4.15గంటల సమయంలో నెల్లూరు విజయమహల్‌గేటు ప్రాంతంలో తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-11 భోగి అగ్నికీలల్లో చిక్కుకుని 30మంది సజీవదహనమయ్యారు. ఈ దర్ఘటనలో మరణించినవారి ఆశల్ని కూల్చింది. బతుకుల్ని బూడిద చేసింది. ఎన్నో హృదయాలను చీల్చింది. కన్నీటి వానను కురిపించింది. విషాదపు వరదను పారించింది. చరిత్రలో చెరగని ఘట్టమైంది. ఆ ఘోరకలికి ఏడాది పూర్తయింది. 30-07-2012 తెల్లవారుజామున 4.15గంటల ప్రాంతంలో ఢిల్లీ నుంచి చెన్నై వెళ్లే తమిళనాడు ఎక్స్‌ప్రెస్(12622) భోగి నెంబరు ఎస్-11లో ఒక్కసారిగా అగ్నికీలలు రేగి 30మంది సజీవదహనమయ్యారు. మరెందరో క్షతగాత్రులయ్యారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌కు కిలోమీటరు దూరంలో విజయమహల్‌గేటు దాటిన వెంటనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ బోగీలో వున్న కొందరు మాత్రమే ప్రాణాలు దక్కించుకుని బయటపడ్డారు.

ఈ విషాదఛాయలు ఇంకా కళ్లముందు కదలాడుతున్నాయి. భర్తలను పోగొట్టుకున్న భార్యలు, తల్లిదండ్రులను పోగొట్టుకున్న చిన్నారులు గుండెలవిసేలా రోదించిన సంఘటనలు ఇంకా నెల్లూరీయుల కళ్లముందు మెదులుతూనే వున్నాయి.

PDF Compressor Free Version



# గుండె పగిలింది

(మొదటిపేజీ తరువాయి)

**రాజకీయ ప్రయోజనాల కోసమే:**

విభజించి పాలించు అన్న సిద్ధాంతాన్ని కాంగ్రెస్‌పార్టీ బ్రిటీష్‌వారి నుండి బాగానే వంటబట్టించుకుంది. కాబట్టే స్వాతంత్ర్యానంతరం ఈ దేశాన్ని ఎక్కువకాలం పాలించ గలిగింది. ప్రజలను కులాల వారీగా, మతాల వారీగా విభజించి వారిని ఓట్లబ్యాంకులుగా ఏర్పాటు చేసుకుని వున్నారు. ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రాంతాలవారీగా కూడా విభజించడం మొదలుపెట్టారు. 2004, 2009ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీకి అత్యధిక లోక్‌సభ స్థానాలు వచ్చింది ఆంధ్రప్రదేశ్ నుండే. దానికి కృతజ్ఞత కాంగ్రెస్‌పార్టీ ఈ రూపంలో చెప్పుకున్నట్లుంది. 2014ఎన్నికలలో ఎక్కువ ఎంపీ సీట్లు కాంగ్రెస్ లక్ష్యం. కాని ఆంధ్రప్రదేశ్‌లో చూస్తే వైకాపా హవా నడుస్తుంది. అటు ఆంధ్రాలోను, ఇటు తెలంగాణలోను కాంగ్రెస్‌కు ఎంపీ సీట్లు వచ్చేటట్లు లేవు. రాష్ట్ర విభజన చేస్తే కనీసం తెలంగాణలోనైనా ఎంపీ సీట్లు వస్తాయనే ఉద్దేశ్యంతోనే అధిష్టానం రాష్ట్రాన్ని చీల్చింది.

**ఆనాటి పరిస్థితులు పునరావృతం కాకుండా:**

కేసీఆర్ కపటనిరాహారదీక్షకు భయపడి 2009డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రకటన చేసింది. ఇది వూహించని పరిణామం. ప్రకటనతో ఉలిక్కిపడ్డ సీమాంధ్రులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. అప్పటికప్పుడు మంత్రులు, ఎంపీలు, అన్ని పార్టీల ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసారు. తెలంగాణ ప్రకటిస్తే ఇంత రియాక్షన్ వస్తుందని ఆనాడు కాంగ్రెస్ అధిష్టానం వూహించలేదు. సీమాంధ్రలో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమాలకు భయపడి తెలంగాణ ప్రకటనను వెనక్కుతీసుకుంది. కాని ఈసారి అలా తొందరపాటుకు పోకుండా కాంగ్రెస్ అధిష్టానం చాలా తెలివిగా వ్యవహరించింది. మొదట రాయలతెలంగాణ పాచిక వదిలింది. దీని మీద చర్చలు, వాదోపవాదాలు జరిగాయి. తెలంగాణ ఇవ్వనున్నారనే సమాచారాన్ని లీక్‌చేసింది. ఈ ప్రచారం ప్రజల్లో బాగా పాకిపోయింది. కాని సీమాంధ్రలో ప్రజల నుండి పెద్దగా వ్యతిరేకత రాలేదు. సమైక్యాంధ్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తుండిన నాయకులను కూడా అధిష్టానం కూల్ చేసింది. మరోపక్క ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం కూడా ఈ విషయంలో సైలెంట్ అయిపోయింది. లగడపాటి రాజగోపాల్, కావూరి సాంబశివరావు లాంటి వాళ్లు కూడా కుక్కినపేనుల్లా అయ్యారు. తెలంగాణ ఇస్తున్నారనే దానిమీద సీమాంధ్రులను మానసికంగా సిద్ధం చేసారు. దిగ్విజయ్ ప్రకటనకు కొన్నిరోజుల ముందే సీమాంధ్రలోని ముఖ్య నగరాలన్నింటిలో సైనిక బలగాలను మోహరించడం తెలంగాణ ప్రకటనకు సంకేతంగా నిలిచింది. పరిస్థితి అంతా సవ్యంగా వుందనుకున్నాక కాంగ్రెస్ విభజన నిర్ణయం తీసుకుంది.

**ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు:**

2009 డిసెంబర్ 9న కేంద్రం తెలంగాణ ప్రకటన చేయగానే సీమాంధ్ర ప్రజాప్రతినిధులంతా మూకుమ్మడి రాజీనామాలు చేసారు. కాని ఈసారి అలా జరగలేదు. ఒకరిద్దరు తప్పితే వెంటనే స్పందించిన ప్రజాప్రతినిధులు లేరు. రాష్ట్ర విభజనకు నిరసనగా సీమాంధ్ర అంతటా బంద్ నిర్వహించినా విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు తప్పితే ప్రజాప్రతినిధులు ముందుండి నడిపించలేదు. కాబట్టి ఈ ఆందోళనల వల్ల కాంగ్రెస్ వెనక్కి పోయేదేమీ వుండదు.

**సీమాంధ్ర నేతల వైఫల్యం:**

తెలంగాణ ఏర్పాటును అడ్డుకోవడంలో సీఎం కిరణ్‌తో సహా సీమాంధ్రకు చెందిన కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు పూర్తిగా విఫలమయ్యారు. తెలంగాణ ఏర్పాటుచేస్తే నక్సలిజం పెరుగుతుందని సీఎం చెప్పాడు. విభజించకుండా వుంటే కాంగ్రెస్‌కు ఇన్ని ఎంపీ సీట్లు తెచ్చిస్తామని సీఎం గ్యారంటీ ఇచ్చివుంటే అధిష్టానం ఆయన మాట విని వుండేది. వాళ్లకు రాష్ట్ర ప్రయోజనాల కంటే సొంత ప్రయోజనాలు ముఖ్యం కదా!

ఎవరు ఎంతగా ఆందోళన చేసినా ఇక లాభం లేదు. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాంగ్రెస్ రాజకీయ స్వార్థానికి రాష్ట్రం రెండు ముక్కలైంది. తెలంగాణ ఏర్పాటుకు రాష్ట్ర శాసనసభ తీర్మానం కూడా అవసరం లేదు. పార్లమెంటులో తెలంగాణ బిల్లు ఆమోదం పొందితే చాలు. ఎలాగూ ప్రధానప్రతిపక్షం బీజేపీ కూడా తెలంగాణకు మద్దతిస్తుంది కాబట్టి రాష్ట్ర విభజన ఖాయమైనట్లే!

ఆనాడు ఇంగ్లాండ్ వాళ్లు మనల్ని విభజించి పాలించారు... ఈనాడు ఇటలీ వాళ్లు మనల్ని విభజించి నాశనం చేస్తున్నారు... ఇదంతా ఇటలీ కాంగ్రెస్ పుణ్యమే!

# తనయ

(మొదటిపేజీ తరువాయి)

2003లో మండుటెండల్లో ప్రజాసమస్యలను తెలుసుకుంటూ బాధితుల కన్నీటిని తుడుస్తూ వై.యస్.రాజశేఖరరెడ్డి చేసిన 1474కిలోమీటర్ల ప్రజాప్రస్థానం పాదయాత్రను ఆయన తనయ షర్మిల మరో ప్రజాప్రస్థానం పాదయాత్రతో బద్దలు కొట్టింది. ఆడమనిపై కూడా, మోకాలికి శస్త్ర చికిత్స జరిగినా ఎండనకా, వాననక లెక్కచేయకుండా ఆమె మరో ప్రజాప్రస్థానం జూలై 30వ తేదీతో 3వేల కిలోమీటర్ల మైలురాయిని దాటింది. అక్టోబర్ 18న ఇడుపులపాయలో తండ్రి వై.యస్. సమాధి నుండి ఆమె తొలి అడుగు వేసింది. మండుటెండల్లో ఎండుతూ, వానల్లో తడుస్తూ ఆమె పాదయాత్ర ముందుకు సాగింది. మధ్యలో ఎన్నో అవాంతరాలొచ్చాయి. మోకాలికి శస్త్ర చికిత్స జరిగింది. అయినా తట్టుకుని, కొన్నిరోజులు విశ్రాంతి తీసుకుని ముందుకు కదిలింది. మొత్తం 14జిల్లాల్లో ఆమె పాదయాత్ర సాగింది. జూలై30న శ్రీకాకుళం జిల్లా దనుపురం వరకు సాగిన పాదయాత్రతో ఆమె 3వేల కిలోమీటర్ల మైలురాయిని అవలీలగా దాటింది. ఇన్ని వేల కిలోమీటర్లు నడిచినా ఆమెలో చిరునవ్వు చెరగలేదు, ఆత్మస్థైర్యం తగ్గలేదు. లక్షలాదిమంది ప్రజల ఆశీస్సుల బలంతో ఆమె ఇంకా ముందుకే కదిలింది. అదే రాజన్న బిడ్డ తడాఖా!

# ప్రజాస్వామ్యమంటారా?

(2వ పేజీ తరువాయి)

సరిగా వుండవు. ఇంతమందికి పనిచేటు ఎందుకు? ప్రతి పంచాయితీ సర్పంచ్ పదవికి, ఎంపీపీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఛైర్మన్, మేయర్, ఎమ్మెల్యే, ఎంపీ వంటి పదవులకు వేలంపాటలు నిర్వహిస్తే.. ఎవరు ఎక్కువ మొత్తానికి పాడితే వారికే పదవులంటే పోలా! ఇంత సిగ్గుమాలిన తనంగా ఎన్నికలు పెట్టుకునే పని వుండదుగా...!

# తండ్రి చేతుల మీదుగా తనయునికి సత్కారం




చార్టర్డ్ అకౌంటెంట్ దుగ్గిశెట్టి సుధాకరమ్‌ను సన్మానిస్తున్న సి.ఏ దుగ్గిశెట్టి రమణయ్య సి.ఏ జాలకృష్ణారావు



సభలో ప్రసంగిస్తున్న గుంటూర్ రేంజ్ ఇన్‌కంటాక్స్ కమీషనరు జె.క్రిష్ణకిషోర్

తండ్రి చేతుల మీదుగా తనయుడికి అపురూప సత్కారం లభించింది. ఆ తండ్రీ కొడుకుల అనుబంధానికి తార్కాణంగా నిలిచింది. ఆ తండ్రి ప్రముఖకవి, రమణీయ రామాయణకర్త ఆడిటర్ దుగ్గిశెట్టి రమణయ్య కాగా, తనయుడు ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ దుగ్గిశెట్టి సుధాకరమ్. దీనికి వేదిక ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఏర్పాటుచేసింది. నెల్లూరు ట్యాక్స్‌బార్ అసోసియేషన్ వార్షికోత్సవ సంబరాలు గతనెల 26న లియో హోటల్‌లో అత్యంత ఆత్మీయంగా జరిగాయి.

ప్రతి సంవత్సరం ఒక సీనియర్ ఆడిటర్ సభ్యుని సత్కరించే సత్‌సాంప్రదాయ నియమాన్ని పెట్టుకొన్న ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఈ సంవత్సరం దుగ్గిశెట్టి వారి తనయుడు సుధాకరమ్‌ను సన్మానించింది. ఆ సన్మాన ప్రక్రియను ఆయన తండ్రి దుగ్గిశెట్టి రమణయ్య మరియు సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్ పి.జాలకృష్ణారావు చేత జరిపించారు. దుగ్గిశెట్టి వారు పుత్రోత్సాహపు సుమతీశతకారుని పద్యాన్ని వినిపించారు. సుధాకరం ఎంతో సౌమ్యుడు మృదుస్వభావి అందరితో కలసిమెలసి ఎలాంటి భేషజాలకు తావివ్వకుండా ఎదిగే కొద్దీ ఒదిగిన మనిషి, తండ్రిలా సాహితీకారుడు కాకపోయినా సాహిత్యాభిలాషి, నెల్లూరులో తొలిసారిగా సినీకవి అయిన తర్వాత వెన్నెలకంటిని సన్మానించిన 'స్పందన' సాహితీ సమాఖ్యకు ఆర్థిక, హార్దిక సహాయ సహకారాలు అందించిన సాహితీ పోషకుడాయన. ఆ వేదిక పైనే సిరివెన్నెల సీతారామశాస్త్రిని, డా॥నాగభైరవ కోటేశ్వరరావును సత్కరించి గౌరవించిన సాహితీ సేవాపరాయణుడాయన. అలాంటి మంచి వ్యక్తికి, స్ఫూర్తి ప్రదాతగా పేరుతెచ్చుకొన్న సుధాకరంను సన్మానించడంతో టాక్స్ బార్ నిర్ణయాన్ని వక్తలు కొనియాడారు.

## నెల్లూరు ట్యాక్స్‌బార్ విశిష్ట కార్యక్రమం

ఆనాటి ప్రత్యేక సభలో ముఖ్యఅతిథిగా గుంటూరు రేంజ్ ఇన్‌కంటాక్స్ కమీషనరు జె.క్రిష్ణకిషోర్ పాల్గొన్నారు. అతిథిగా అడిషనల్ కమీషనరు పి.రాజారామ్ పాల్గొన్నారు.

కమీషనరు జె.క్రిష్ణకిషోర్ ఐఆర్ఎస్‌గానే కాకుండా చార్టర్డ్ అకౌంటెంట్ కూడా కావడం ఆడిటర్లను ఆకట్టుకొన్న విషయం అయింది. ఎంతో హుందాగా ప్రసంగించా రాయన. నెల్లూరు ఆడిటర్ల డైరక్టరీని ఆయన చేతుల మీదుగా ప్రారంభింపజేసారు. ఆనాటి సభకు నెల్లూరు ట్యాక్స్‌బార్ అసోసియేషన్‌ను సమర్ధవంతంగా నడిపిస్తున్న అధ్యక్షులు సి.ఏ జె.వి.చలపతిరావు అధ్యక్షించారు. కార్యదర్శి సి.ఏ వెంకటశేషయ్య పాల్గొన్నారు. గత సంవత్సరంవరకూ నామమాత్రా వశిష్టంగా కొందరికే పరిమితమైన నెల్లూరు ట్యాక్స్‌బార్ అసోసియేషన్ ఒక్కసారిగా కదలిక వచ్చి కార్యక్రమాల వెల్లువతో అందరిని కలుపుకొని పోతున్న అధ్యక్ష కార్యదర్శులు జె.వి.చలపతిరావు, ఎ.వి.శేషయ్య అభినందనీయులు.

## ఏపీ ఆర్యవైశ్య మహిళా విభాగ్ అధ్యక్షురాలుగా లక్ష్మికుమారి




ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహిళా విభాగ్ నూతన అధ్యక్షురాలుగా విజయవాడకు చెందిన మానేపల్లి లక్ష్మీకుమారిని నియమిస్తూ మహాసభ అధ్యక్షులు కాళ్ళకూరి శ్రీరామనాగేశ్వరరావు (నాగబాబు) నియామక పత్రాన్ని అందజేసినట్లు లక్ష్మీకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సీమాంధ్ర సీరియస్

(మొదటిపేజీ తరువాయి)

నిలవడమే తమ ధర్మంగా భావించారు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు. రాష్ట్ర విభజనకు నిరసిస్తూ మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధపడ్డారు. 1వ తేదీ హైదరాబాద్‌లో సమావేశమైన మంత్రులు, ఎమ్మెల్యేలు సీమాంధ్రలో జరుగుతున్న సమైక్య ఉద్యమానికి అండగా నిలవాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో మంత్రులు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేలు స్పీకర్‌కు తమ రాజీనామాలను అందజేయాలని తీర్మానించారు. 1వ తేదీ మధ్యాహ్నం నుండే రాజీనామాల పర్వం మొదలైంది. సీమాంధ్ర మంత్రులు, ఎమ్మెల్యేలంతా రాజీనామాలు చేస్తే సర్కార్ సంక్షోభంలో పడ్డట్లే. అయితే రాష్ట్రంలో అధికారంపై ఆశలు వదులుకున్న కాంగ్రెస్‌ను ఈ రాజీనామాలు కదిలిస్తాయా... అన్నది సందేహమే!




నెల్లూరులో జరిగిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ ఘోర సంఘటనకు జూలై 30వ తేదీతో యేడాది పూర్తయిన సందర్భంగా 4గ్రాముల 500మిల్లీగ్రాముల వెండితో స్వర్ణకారుడు షేక్ మునవ్వర్ రూపొందించిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ నమూన.

## కాలధర్మం

# డాక్టర్ వెంకటరమణారెడ్డి



నెల్లూరులోని ప్రముఖ ఇఎన్‌టీ స్పెషలిస్ట్, శివప్రియ చెవి, ముక్కు గొంతు వైద్యశాల అధినేత డాక్టర్ ఎ.వెంకటరమణారెడ్డి ఈ నెల 1వ తేదీ ఉదయం కన్నుమూసారు. గత కొంతకాలంగా ఆయన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1961 సెప్టెంబర్ 11వ తేదీన జన్మించారు. పొదలకూరు మండలంలోని లింగంపల్లి ఆయన స్వగ్రామం. తిరుపతిలో యంబిబియస్, కర్నూలు మెడికల్ కాలేజీలో యం.యస్ పూర్తి చేశారు. 1993 నుండి నెల్లూరు, విజయమహల్ సెంటర్‌లో ఆసుపత్రిని నెలకొల్పి వైద్యసేవలందిస్తున్నారు. ఐఎంఏ జిల్లా కార్యదర్శిగా, ఇఎన్‌టీ వైద్యుల అసోసియేషన్ కార్యదర్శిగా, రోటరీక్లబ్ అధ్యక్షులుగా, తెలుగుదేశంపార్టీ వైద్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పలు పదవులు నిర్వహించారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని మారుమూల ప్రాంతాలలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. అందరితో కలుపుగోలుగా వుండే వ్యక్తి, అందరి మన్ననలు పొందిన వైద్యుడు ఆయన. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ఆత్మ విశ్వాసంతో మరిన్ని విజయాలు

-కాకాణి



వైయస్సార్సీపీ మద్దతుతో వెంకటాచలం మండలం పాలిచెర్లపాడు సర్పంచ్‌గా బిరుదవోలు సుబ్బులయ్య, రామదాసు కండ్రిగ సర్పంచ్‌గా నండి సుధాకర్‌లు విజయం సాధించిన సందర్భంగా జూలై 29న వైయస్సార్సీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్సీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని అక్రమంగా నిర్బంధించినా ప్రజల మనస్సుల్లోంచి తొలగించలేరని అన్నారు. కాంగ్రెస్, తెలుగుదేశాలు కుమ్మక్కు రాజకీయాలు చేసినా పంచాయితీ ఎన్నికల ఫలితాలు వారికి మచ్చెమటలు పట్టిస్తున్నాయన్నారు. వైయస్సార్సీపీ నేతలు కార్యకర్తలు మరింత ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే మరిన్ని విజయాలు మన స్వంతమవుతాయని ప్రకటించారు. ఆ విజయాలే జగన్మోహన్‌రెడ్డిని నిర్బంధంలో నుంచి వెలుపలికి తీసుకురావడానికి అస్త్రాలు అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైయస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, పాలిచర్లపాడు గ్రామ నాయకులు ప్రసాద్, రామదాసుకండ్రిగ, గ్రామ ఉపసర్పంచ్ చల్లా చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రం మధ్యలో గోడ

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన మరికొద్ది నిమిషాల్లో వెలువడబోతున్న వేళ టాలీవుడ్‌కు సంబంధించిన హేమాహేమీ లంతా టెన్షన్‌తో టీవీల ముందు కూర్చుని వార్తలు చూసారు. తెలంగాణ ప్రకటన వెలువడిన వెంటనే ఎవరూ ఎటువంటి కామెంట్ చేయలేదు. కాని కుర్ర హీరో నాని మాత్రం ట్విట్టర్‌లో మన ఇంటి మధ్యలో గోడ కడు తున్నారన్నమాట! సరే, ఎన్ని చూసాం... ఇదీ చూస్తూ కూర్చు ద్దాం అంటూ ట్వీట్ చేసాడు. దీనిపై సినీ పరిశ్రమలో ఎవరూ స్పందించకపోవడం గమనార్హం.

## మూ'వీ'క్షణం

## 'పవర్' చూపిన పవన్



బాబాయ్ పవర్ ముందు అబ్బాయ్ చాలలేదు. పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ సినిమా 'అత్తారింటికి దారేది'పై రామ్‌చరణ్ 'ఎవడు'ను పోటీకి దింపిన దిల్‌రాజు, చివరికి మడమతిప్పక తప్పలేదు. జూలై 31వ తేదీన విడుదల చేయాలనుకున్న 'ఎవడు'ను ఆగస్టు 21కి వాయిదా వేస్తున్నట్లు దిల్‌రాజు ప్రకటించాడు. దీనికి తెలంగాణ సమస్యను కారణంగా చూపుతునప్పటికి, పవర్‌స్టార్ ఫ్యాన్స్ పవర్ ధాటికే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సినీ పరిశ్రమ వర్గాల భోగట్టా!



## నయన చుట్టూ బాలయ్య

'సింహ', 'శ్రీరామరాజ్యం' సినిమాల్లో తన జోడీగా నటించిన నయనతార మీద బాలయ్య దృష్టి పడింది. 'జయసింహా' సినిమాలో కూడా ఆమెనే హీరోయిన్‌గా పెట్టాలని బాలకృష్ణ చాలా సీరియస్‌గా ట్రైచేశాడు. ముసలిహీరోల పక్కన ఇక చేసేది లేదని ఆమె చెప్పడంతో కొత్త హీరోయిన్ కోసం వెదికారు. అయితే బాలకృష్ణ మనసు మార్చుకోక బోయపాటి మీద ఒత్తిడి తెచ్చాడు. దీంతో బోయపాటి నయనను ఏ విధంగా బతిమలాడాడో గాని బాలయ్య పక్కన నటించడానికి ఆమె ఒప్పుకున్నట్లు సూచాయగా తెలుస్తుంది.

# గూడూరు డివిజన్ వార్తలు

## జీవవైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యత



పర్యావరణ అవగాహనసదస్సులో సర్టిఫికేట్లు ఇస్తున్న దృశ్యం

జాతీయ పర్యావరణ జాగృతి కార్యక్రమంలో భాగంగా సోమవారం జీవ వైవిధ్య సంరక్షణ అనే అంశం పై భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ కదిరి లోని ప్రాంతీయ వనరుల కేంద్రం స్వాప్స్ సహకారంతో చిత్తూరు సపోర్ట్ సేవాసంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వక్తలు జీవవైవిధ్య సంరక్షణ ప్రతి ఒక్క మానవుని కనీస బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగి శెట్టి ధర్మయ్య మాట్లాడుతూ ప్రస్తుతరోజుల్లో విపరీతమైన పారిశ్రామీకరణ వల్ల అడవులు, జంతువులు అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో పాస్ స్వచ్ఛంధ సేవాసంస్థ అధ్యక్షులు దగ్గోలు సురేంద్రబాబు, ఎం.రవీంద్ర రెడ్డి, సురేష్‌బాబు, విజయమ్మ, బుజ్జయ్య, కమలమ్మ, పి.సుబ్బారావు, ఎం.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## లోను మంజూరుకు సహాయం చేయండి



ఆర్డీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న బసివిన్ని, మాతమ్మలు

గూడూరుకు చెందిన బసివిన్లు, మాతమ్మలు కలిసి ఆర్డీవోకు సోమవారం వారందరూ కలిసి వ్యాపారం చేసుకొనేందుకు లోన్లు ఇప్పించమని వినతిపత్రం సమర్పించారు. ఆర్డీవో స్పందించి ఆ అర్జీని పరిశీలించి తమకు న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు.

## విద్యార్థులకు దుస్తుల పంపిణీ

గూడూరులోని షాదిమంజిల్‌లో మహ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఇటీవల పేద ముస్లిం విద్యార్థులు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ నెట్‌వర్క్ అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ మాట్లాడుతూ రంజాన్‌నెలను పురస్కరించుకొని పేద ముస్లిం సోదరులు ప్రతిఒక్కరూ పండుగను సంతోషంగా చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అలాగే తమ నెట్‌వర్క్ ఏర్పాటై 6ఏళ్లు పూర్తవు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి రోడ్డు భవనాల ఈఈ మసూద్ సాహెబ్, ఎంఈవో ఇస్మాయిల్, ఈ నెట్‌వర్క్ వ్యవస్థాపకులు షేక్‌రియాజ్ అహ్మద్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం



లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

ప్రజలకు ప్రణాళికా బద్ధంగా సేవలు అందించాలని లయన్స్‌క్లబ్ రాష్ట్ర గవర్నర్‌లు ఎమ్.సుధాకర్‌రెడ్డి, డాక్టర్ పి.మధుసూధన శాస్త్రిలు అన్నారు. గూడూరు డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో సోమవారం రాత్రి లయన్స్‌క్లబ్ 2013-14 సంవత్సరానికి నూతన కార్యవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో లయన్స్‌క్లబ్ ముందుందన్నారు. క్రమపద్ధతిలో విద్య, వైద్యంపై దృష్టిసారించి సేవాకార్యక్రమాలు రూపొందించుకోవాలన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సెక్రటరీ వాకాటి రామమోహనరావు, ట్రెజరర్ తన్నమాల లీలామోహన్‌రెడ్డి, జాయింట్ ట్రెజరర్ కటివేటి చంద్రశేఖర్, పీఆర్ఓ. పొనకా మల్లికార్జున రెడ్డిలచే ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మల్లు విజయకుమార్‌రెడ్డి, మయూరి శ్యాంయాదవ్, షేక్ రియాజ్ అహ్మద్, ఎమ్.మురళీరెడ్డి, నీలం రాజారెడ్డి, ఎస్.వి.ఎల్. ప్రసాద్‌రావు, రూపేష్ రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లు ఖరారు పోరుకు తయారు

గూడూరు పట్టణంలో త్వరలో జరగనున్న గూడూరు పురపాలకసంఘం ఎన్నికలకు వార్డుల వారీగా రిజర్వేషన్లను మున్సిపల్ కమీషనర్ జి.సుశీలమ్మ ఇటీవల విడుదల చేశారు. రిజర్వేషన్ల వారీగా వివిధ వార్డులలో పోటీచేసేందుకు ఆయా పార్టీల నాయకులు సిద్ధమవుతున్నారు. గూడూరు మున్సిపాలిటీలో ఓటర్ జాబితా తప్పుల తడకగా మారింది. దీని ప్రభావం వార్డుల రిజర్వేషన్ల ఖరారుపై పడడంతో పోటీకి ఉవ్విళ్లూరుతున్న ఆశావహుల్లో గందరగోళం మొదలైంది. ఇంటింటికి వెళ్లి పరిశీలించి కులాల వివరాలను సేకరించి సిద్ధం చేయాల్సిన ఓటర్ జాబితా విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ఆశావహులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి తమ అభ్యంతరాలను వ్యక్తంచేసి, మున్సిపల్ ప్రత్యేక అధికారి మధుసూధనరావుకు యువజన నాయకుడు కోడూరు మీరారెడ్డి, గూడూరు బ్రాహ్మణసేవాసంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు యరగుడిపాటి చలపతి రావు, ఇసకపల్లి శివప్రసాద్ ఫిర్యాదు చేసారు. కొన్ని వార్డుల్లో లేని సామాజిక వర్గానికి చెందిన వారిని ఉన్నట్లు చూపడం, ఉన్న వర్గాన్ని లేనట్లుగా చూపడంతో ఆ ప్రాతిపదికన సిద్ధమైన వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ తప్పులు తడకగా మారింది. 23వ వార్డులో బ్రాహ్మణులను ఎస్సీలుగా చూపారు.



PDF Compressor Free Version



# విభజనతో... ఎవరికి లాభం... ఎవరికి నష్టం!



*రాజకీయ ప్రయోజనాల కోసమే రాష్ట్ర విభజన జరిగింది. ఇందులో సందేహిం చాల్సిందేమీ లేదు. కాకపోతే జరిగిన విభజన ఏ పార్టీకి ప్రయోజనంగా మారబో తుందన్నదే ప్రశ్న!*

తెలంగాణ నుండి అధికంగా లాభం పొంద్దాలని చూస్తున్న పార్టీ కాంగ్రెస్. రాష్ట్రంలో పదేళ్ల నుండి ఆ పార్టీ ప్రభుత్వమే నడుస్తుంది. ప్రజలలో బాగా వ్యతిరేకత వచ్చింది. రేపు ఎన్నికలొస్తే ప్రభుత్వం పడిపోవడం ఖాయం. కాని ఇప్పుడు విభజించిన దానివల్ల ఆంధ్రప్రదేశ్‌లో పోయినా తెలంగాణలో తిరిగి అధికారంలోకి వస్తామనే ధీమా ఆ పార్టీ నాయకులలో వ్యక్తమవుతుంది. తెలంగాణ ఇచ్చిందనే కృతజ్ఞతతో తెలంగాణ ప్రజలు ఈసారి కాంగ్రెస్‌కే ఓట్లేస్తారనేది వారి నమ్మకం.

టీఆర్ఎస్ ధోరణి కూడా ఇదే. ఉద్యమాలు నడిపింది మేము కాబట్టి తెలంగాణ క్రెడిట్ మాదేనని, తెలంగాణ ప్రజలు మా వెంటే వుంటారని టీఆర్ఎస్ వారి నమ్మకం. కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ విలీనం కాకుంటే మాత్రమే తెలంగాణ ప్రజలు టీఆర్ఎస్‌ను ఏ మాత్రం ఆదరిస్తారో చూడగలం.

ఇక రెండుకళ్ల సిద్ధాంతంతో రెండు కళ్లు కుళ్లబొడుచుకుంది తెలుగుదేశంపార్టీ. ఒకప్పుడు తెలంగాణలో తెలుగుదేశం బలంగా వుండేది. కాని తెలంగాణ ఉద్యమం మొదలయ్యాక ఆ పార్టీ నాయకులు చాలామంది టీఆర్ఎస్‌లోకి వెళ్లిపోయారు. అందరూ వెళ్లాక తెలంగాణకు తాము సమ్మతమేనని చంద్రబాబు కేంద్రానికి లేఖ వ్రాసారు. అప్పటికే తెలంగాణలో ఆ పార్టీకి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. చంద్రబాబు తెలంగాణకు మద్దతు పలకడంతో సీమాంధ్రలోనూ ఆ పార్టీ మీద వ్యతిరేకత పెరిగింది. ఇప్పుడు సీమాంధ్ర ప్రజలు కాంగ్రెస్ మీద ఎంత కోపంతో వున్నారో, చంద్రబాబు మీద కూడా అంతే కోపంతో వున్నారు. దీంతో తెలుగుదేశం పరిస్థితి రెంటికి చెడిన రేవడి అయ్యింది.

తెలంగాణ ఏర్పాటు వల్ల ఒక రాష్ట్రంలో పూర్తిగా లబ్ధిపొందనున్న పార్టీ వైయస్సార్ కాంగ్రెస్. పంచాయితీ ఎన్నికల ఫలితాలతో తెలంగాణలో తమ ప్రభావం పెద్దగా లేదనే విషయం వైకాపా నాయకులకు అర్థమైంది. అదే సమయంలో కేంద్రం రాష్ట్ర విభజనకు పూనుకోవడంతో వీళ్లు సమైక్యాంధ్ర స్టాండ్ తీసుకున్నారు. ముందుగానే రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసారు. సమైక్యాంధ్రకు మద్దతుగా నిలిచిన ఏకైక పెద్ద పార్టీ వైకాపా. కాబట్టి ఆంధ్రప్రదేశ్‌లో ఆ పార్టీకే ఆదరణ ఖాయం.

ఇక తెలంగాణలో భవిష్యత్‌లో బలపడనున్న పార్టీ బీజేపీ. ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీనే ఈ విషయం స్వయంగా ఒప్పుకున్నారు. అక్కడ తెలుగుదేశం క్రమంగా బలహీనపడుతుంది. టీఆర్ఎస్ తెరమరుగవుతుంది. భవిష్యత్ పోటీ కాంగ్రెస్-బీజేపీల మధ్యే నెలకొంటుంది. తెలంగాణ ఉద్యమంలో బీజేపీ కూడా కీలక పాత్ర పోషించింది. లీడర్, కేడర్ బాగానే వుంది. ఆ పార్టీ క్రమంగా బలపడడం ఖాయం.

## పాత రాష్ట్రానికి కొత్త రాజధాని | కొత్త రాష్ట్రానికి పాత రాజధాని

రాష్ట్ర విభజనలో ఇదో కొత్త ప్రక్రియ. మద్రాసు రాష్ట్రం నుండి తెలుగువారు విడిపోయి ఆంధ్రరాష్ట్రంగా ఏర్పడినప్పుడు కర్నూలులో కొత్త రాజధానిని ఏర్పాటు చేసుకున్నారు. అంతేగాని మద్రాసునే రాజధానిగా అడగలేదు. అంతెందుకు ఎన్డీఏ ప్రభుత్వంలో ఉత్తరప్రదేశ్‌ను చీల్చి ఉత్తరాఖండ్‌ను, బీహార్ చీల్చి జార్ఖండ్‌ను, మధ్యప్రదేశ్‌ను చీల్చి చత్తీస్‌గఢ్‌ను ఏర్పాటు చేసారు. ఈ మూడు కొత్త రాష్ట్రాలకు కొత్త రాజధానులనే ఏర్పాటు చేసుకున్నారు. అంతేగాని పాత రాజధానులను కొత్త రాష్ట్రాలకు ఇవ్వలేదు. కాని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ విభజన మాత్రం అందుకు భిన్నంగా జరుగుతుంది. ప్రత్యేక డిమాండ్ మీద ఏర్పడుతున్న చిన్న రాష్ట్రం తెలంగాణ. పది జిల్లాలతో తెలంగాణ ఏర్పడనుండగా, మిగిలిన 13జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ అలాగే కొనసాగనుంది. అయితే 1956 నుండి కూడా ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా వున్న హైదరాబాద్ నగరం చిన్న రాష్ట్రం తెలంగాణకు రాజధాని కానుండగా, పెద్దరాష్ట్రంగా మిగిలిన ఆంధ్రప్రదేశ్ మాత్రం కొత్త రాజధానిని నిర్మించుకోవాల్సి వస్తుంది. ఇదెలా వుందంటే పుట్టినప్పటినుండి గొడ్డుచాకిరి చేసి ఆస్తిని పోగుచేసి పెట్టిన అన్నను ఏమీ పనిచేయకుండా తింటూ తిరిగిన తమ్ముడు కట్టుబట్టలతో ఇంటి నుండి వెళ్లగొట్టినట్లుగా వుంది.

# దిగ్విజయుంగా...



*వ్యవస్థలు బాగుపడినా, నాశనమైనా వాటిని శాసించే వ్యక్తుల చేతుల్లోనే వుంటుంది. రాష్ట్ర కాంగ్రెస్ పరిశీలకుడిగా దిగ్విజయ్‌సింగ్ రావడమే ఆంధ్రప్రదేశ్‌కు శాపంగా మారింది. రాష్ట్రాన్ని విడగొట్టిన పాపంలో ప్రధాన వాటా ఆయనకే చెల్లుతుంది.*

రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ పరిశీలకుడిగా దిగ్విజయ్‌సింగ్ వచ్చాకే తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ వూపందుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించాడు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు పెద్దగా సీన్‌లేదని, వచ్చే ఎన్నికలలో సింగిల్ డిజిట్ ఎంపీ స్థానాలు కూడా రావని గ్రహించాడు. రాష్ట్ర విభజనపై తెలంగాణ వాళ్లు కూడా మౌనంగా వున్న సమయంలో దిగ్విజయ్ సింగ్ ఈ తేనెతుట్టెను కలబెట్టాడు. తెలంగాణపై త్వరలోనే ఏదో ఒకటి తేల్చేస్తామని ఘనంగా ప్రకటించాడు. సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షులను రూట్‌మ్యాప్‌లతో రమ్మన్నాడు. వీళ్ల ముగ్గురూ రూట్‌మ్యాప్‌లతో పోవడం, కాంగ్రెస్ కోర్‌కమిటీ భేటీలో చర్చించడం జరిగిపోయింది. ఇటీవలే జరిగిన కోర్‌కమిటీలో తెలంగాణపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కాని కోర్‌కమిటీ భేటీ తర్వాతే దిగ్విజయ్ తన వ్యూహానికి పదునుపెట్టాడు. తెలంగాణ ఏర్పాటుకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎప్పుడో నిర్ణయం తీసుకుంది. కాకపోతే కోర్‌కమిటీ భేటీలు, రోడ్‌మ్యాప్‌లన్నీ కూడా అందరితో చర్చించి విభజించామని చెప్పడానికే! మొత్తానికి రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ పరిశీలకుడిగా వచ్చిన దిగ్విజయ్‌సింగ్ రాష్ట్రాన్నే చీల్చడంలో తనవంతు పాత్రను దిగ్విజయంగా పూర్తిచేసాడు.

# విభజన జరిగింది... విలీనం మిగిలింది!

## కేసీఆర్‌కు ఇక సన్యాసమే



రాష్ట్రం సమైక్యంగా వుండాలని సీమాంధ్ర వాళ్లు ఎంత బలంగా కోరుకున్నారో అంత కన్నా బలంగా కోరుకున్న నాయకుడు కేసీఆర్. ఈరోజు రాష్ట్రం విడిపోవడానికి బీజం వేసింది ఆయనే! తన రాజకీయ మనుగడ కోసం ఆయన తెలంగాణ పదాన్ని వాడుకున్నాడు తప్పితే నిజంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని ఆయన ఎన్నడూ కోరుకోలేదు. తెలంగాణపై ఆయనకు అంత చిత్తశుద్ధి కూడా లేదు. తన రాజకీయ మనుగడకు తెలంగాణను ఆయన ఒక వేదికగా చేసుకున్నాడు. తెలంగాణ ఉద్యమం పేరుతోనే ఆయన తెలంగాణలో వున్న సీమాంధ్ర వ్యాపారులను, పారిశ్రామికవేత్తలను శాసిస్తూ వచ్చాడు. వాళ్ల నుండి కోట్లు కొల్లగొట్టాడు. వేలకోట్ల ఆస్తులకు పడగలెత్తాడు. తెలంగాణ సమస్య అలా రగులుతూ వుంటేనే కేసీఆర్ ప్రభ అలా వెలుగుతూ వుంటుంది. అదే తెలంగాణ ఇచ్చేస్తే... ఇక ఆయనను పట్టించుకునేవాళ్లే వుండరు. ఇప్పుడదే జరిగింది.

కేసీఆర్ ఏదైతే జరగదనుకున్నాడో కాంగ్రెస్ పార్టీ దానినే చేసింది. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర విభజన చేయదనే గట్టి నమ్మకంతోనే ఆయన గతంలో తెలంగాణ ఇస్తే టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని చెప్పివున్నాడు. ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణను ప్రకటించేసరికి ఆయనది కక్కాలో మింగాలో తెలియని పరిస్థితి. తెలంగాణ ఇచ్చిన ఖ్యాతంతా కాంగ్రెస్‌కు పోతుంది. కాంగ్రెస్ తెలంగాణ ప్రకటించే విషయంలో కేసీఆర్‌కు రవ్వంత ప్రాధాన్యతకూడా ఇవ్వలేదు. తెలంగాణ ప్రకటన చేసాక దిగ్విజయ్‌సింగ్ కూడా కేసీఆర్ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తానని మాటిచ్చాడనే విషయాన్ని ప్రస్తావించారు. కేసీఆర్ కూడా కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ విలీనంపై ఆలోచిస్తున్నాడు. అలా జరిగితే టెన్‌జనపథ్ ముందు ఆయన చేతులు కట్టుకుని నిలబడాల్సిందే! కాంగ్రెస్‌లో విలీనం చేయక పోయినా తెలంగాణలో కేసీఆర్‌కు ఇక పెద్దగా సీన్ వుండదు.




నెల్లూరులోని హోటల్ అతిథి గ్రాండ్ అధినేత యిమ్మడిశెట్టి సురేష్‌కుమార్ కుమార్తె భవ్యహాన్విత పుట్టినరోజును పురస్కరించుకుని జూలై 30వ తేదిన నార్తురాజుపాలెంలోని విశ్వజనని బాలసదన్ అనాథాశ్రమంలో పిల్లలకు ఆటవస్తువులు పంపిణీ చేస్తున్న వాసవిక్లబ్ అధ్యక్షులు సి.వి.శరత్‌కుమార్, వనిత క్లబ్ అధ్యక్షులు సి.ఉమారాణి, ఇ.సురేష్‌కుమార్, జీవనగంగ, రాజరాజేశ్వరి తదితరులు




Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.